


'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575



అక్షర **రాజముద్ర**

www.rajamudranews.com

ప్రతి అక్షరం - ప్రజల కోసం | తెలుగు దిన పత్రిక

AKSHARA RAJAMUDHRA | RNI No: TELTEL/2024/86684

| మేడ్చల్-మల్కాజ్‌గిరి | ఆదివారం | 17.05.2026 | సంపుటి: 3 | సంచిక: 105 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | SUNDAY | 17.05.2026 | VOLUME : 3 | ISSUE : 105 | PAGES: 8 | COST: 2/- |



## విలేకరులు కావలెను

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9182 474 575




## సీనియర్లకు పదవి గండం..! కొత్త ముఖాలకు మంత్రి యోగం..?

- జూపల్లి స్థానంలో మరో వెలమ నేతకు అవకాశం
- కొండా, పొన్నంకు ఉద్వాసన ప్రచారం
- కాంగ్రెస్ పార్టీలో జోరుగా చర్చలు

**హైదరాబాద్, మే 16(రాజముద్ర న్యూస్):** రాష్ట్ర మంత్రి వర్గ విస్తరణపై కాంగ్రెస్ పార్టీలో విస్తృత చర్చ సాగుతోంది. కొందరు సీనియర్ మంత్రులను తప్పించి కొత్త వారికి అవకాశం కల్పించే దిశగా అధిష్టానం ఆలోచిస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్థానంలో మరో వెలమ సామాజిక

మిగతా 2వ పేజీలో..

## ఇంధన ధరల పెంపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

- కేంద్రానికి సీఎం రేవంత్ రెడ్డి డిమాండ్
- ధరల పెంపుతో ప్రజలపై భారం మోపవద్దు

2

# పోలీసులకు లొంగిపోయిన భగీరథ



లాయర్ల సమక్షంలో అప్పగించానన్న బండి

నార్సింగ్ వద్ద అదుపులోకి తీసుకున్నట్లు పోలీసుల వెల్లడి

**హైదరాబాద్, మే 16 (రాజముద్ర న్యూస్):** పోక్సో కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న బండి సాయి భగీరథ్ ఎట్టకేలకు పోలీసుల ఎదుట లొంగిపోయారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ తన కుమారుడు భగీరథ్‌ను అడ్వకేట్ల సమక్షంలో పోలీసులకు అప్పగించారు. చట్టం మీద గౌరవంతోనే భగీరథ్‌ను పోలీసులకు అప్పగించినట్లు ఆయన తెలిపారు. చట్టం ముందు అందరూ సమానమే.. చట్టానికి అందరూ లోబడి ఉండాల్సిందే అని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. కేంద్ర మంత్రి

మిగతా 3వ పేజీలో..

### భగీరథ్ లొంగిపోయాడా..? పోలీసులే అరెస్ట్ చేశారా..?

- కుమారుడిని అప్పగించామని బండి సంజయ్ వ్యాఖ్య
- నార్సింగి వద్ద అరెస్ట్ చేశామని పోలీసుల వెల్లడి
- పోక్సో కేసులో కొనసాగుతున్న ఉత్కంఠ
- పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌కు తరలింపు


3

### కుమారుడి లొంగుబాటుపై బండి సంజయ్ స్పందన

- చట్టంపై గౌరవంతోనే పోలీసులకు అప్పగించాం
- న్యాయవ్యవస్థపై పూర్తి విశ్వాసమున్నదన్న బండి సంజయ్
- నిర్దోషిత్వం నిరూపించుకునేందుకు ఆధారాలు సేకరించామన్న వ్యాఖ్య
- భగీరథ్ లొంగుబాటుతో ముగిసిన ఉత్కంఠ

3

## తెలంగాణలో ఓటర్ల జాబితా సమగ్ర సవరణకు శ్రీకారం



- వచ్చే నెల 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రారంభం
- జులై 31న ముసాయిదా ఓటరు జాబితా విడుదల
- ఆగస్టు 30 వరకు అభ్యంతరాలకు అవకాశం
- అక్టోబర్ 1న తుది ఓటరు జాబితా ప్రచురణ

2


## మలక్‌పేట, ఉప్పుగూడ స్టేషన్లకు పూర్వ వైభవం

- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



**హైదరాబాద్, మే 16 (రాజముద్ర న్యూస్):** మలక్‌పేట్, ఉప్పుగూడ స్టేషన్లను గతంలో వేలాదిమంది ప్రజలు ఉపయోగించుకునే ముఖ్యమైన స్టేషన్లు. కాలక్రమేణా వాటి ప్రాధాన్యత తగ్గినా ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో ఆధునిక సదుపాయాలతో వీటిని పునరుద్ధరిస్తున్నామని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. మ□క్‌పేట ఉప్పుగూడ రైల్వే స్టేషన్‌లలో జరుగుతున్న ఆధునికీకరణ

మిగతా 2వ పేజీలో..



## 'ఆపరేషన్ ఆక్టోపస్ 3.0'

- సైబర్ నేరగాళ్లపై ఉక్కుపాదం
- 15 రాష్ట్రాల్లో ఏకకాలంలో దాడులు

**హైదరాబాద్, మే 16 (రాజముద్ర న్యూస్):** సైబర్ నేరాలకు సిమ్ కార్డులు సరఫరా చేస్తున్న ముఠాలపై హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు దేశవ్యాప్తంగా విస్తృత స్థాయిలో దాడులు చేపట్టారు. 'ఆపరేషన్ ఆక్టోపస్ 3.0' పేరుతో కొనసాగుతున్న ఈ ప్రత్యేక ఆపరేషన్‌లో పలువురు అనుమానితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రాజస్థాన్, గుజరాత్, పశ్చిమ బెంగాల్, ఢిల్లీ, కర్ణాటక, మహారాష్ట్ర, బీహార్, జార్ఖండ్ సహా మొత్తం 15 రాష్ట్రాల్లో ఏకకాలంలో తనిఖీలు నిర్వహిస్తున్నారు. సైబర్ నేరాలకు ఉపయోగించే సిమ్ కార్డులను సరఫరా చేస్తున్న నెట్వర్క్‌లను గుర్తించిన పోలీసులు 10 మంది ఏజెంట్లను అరెస్ట్ చేశారు. అలాగే మధ్యవర్తులుగా వ్యవహరిస్తున్న

మిగతా 3వ పేజీలో..

## మహిళల ఆర్థిక స్వావలంబనకు వేదిక స్త్రీ నిధి

- మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క
- స్త్రీ నిధి వార్షిక కార్యాచరణ ప్రణాళిక అమలు కార్యక్రమం

**హైదరాబాద్, మే 16 (రాజముద్ర న్యూస్):** స్త్రీనిధి సంస్థ మన ఇల్లు వంటిది.. సంస్థను కాపాడుకుంటేనే ఉద్యోగుల హక్కులు, భవిష్యత్తు సురక్షితంగా ఉంటాయి అని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ

మిగతా 2వ పేజీలో..




## ప్రధాని మోదీకి కవిత లేఖ

- బండి సంజయ్‌ను బర్తరఫ్‌కు డిమాండ్
- నిష్పక్షపాత దర్యాప్తు కోసం పదవి నుంచి తప్పించాలని విజ్ఞప్తి
- హోంశాఖలో కొనసాగితే విచారణపై ప్రభావం ఉంటుందనే ఆరోపణ
- ప్రజా విశ్వాసం కాపాడేందుకు తక్షణ నిర్ణయం అవసరమని వ్యాఖ్య
- కుమారుడిపై పోక్సో కేసు నేపథ్యంలో లేఖ రాసిన తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు

3



## ఇంధన ధరలు తగ్గించాలని సీపీఐ నిరసన

- మోడీ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందన్న కూనంనేని
- ఖాళీ సిలిండర్, ఆటో లాగుతూ వినూత్న ఆందోళన
- కార్పొరేట్లకు అనుకూలంగా కేంద్ర విధానాలంటూ విమర్శ
- పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు తగ్గించాలని డిమాండ్
- హిమాయత్‌నగర్‌లో సీపీఐ భారీ నిరసన ప్రదర్శన

2

## వచ్చే ఏడాది చివరి నాటికి దేవాదుల పూర్తి చేయాలి

- అధికారులు, కాంట్రాక్టర్లకు మంత్రుల ఆదేశాలు
- రూ.18,400 కోట్లకు చేరిన ప్రాజెక్టు వ్యయం
- మరో రూ.3,978 కోట్లతో పనులు
- పూర్తి చేయాలని నిర్ణయం
- పనిచేయని కాంట్రాక్టర్లపై చర్యలకు హెచ్చరిక
- 10 జిల్లాల్లో 5.56 లక్షల ఎకరాలకు సాగునీరు లక్ష్యం
- రాష్ట్ర సాగునీరు, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్

2



# ఇంధన ధరల పెంపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

- కేంద్రానికి సీఎం రేవంత్ రెడ్డి డిమాండ్
- ధరల పెంపుతో ప్రజలపై భారం మోపవద్దు
- ఎన్నికల హామీలకు విరుద్ధంగా కేంద్రం వైఖరి
- ఇరాన్-ఇజ్రాయిల్ యుద్ధాన్ని సాకుగా చూపడం తగదు



**తెలంగాణ బ్యూరో :**

దేశవ్యాప్తంగా ఇంధన ధరల పెంపు నిర్ణయం ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీసే చర్య అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు. పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఎక్స్ వేదికగా స్పందించిన ఆయన, ఈ ధరల పెంపు సామాన్యులు, మధ్యతరగతి కుటుంబాలపై అదనపు భారంగా మారిందని పేర్కొన్నారు.

ఇరాన్ఇజ్రాయిల్ యుద్ధ పరిస్థితులను సాకుగా చూపుతూ ఇంధన ధరలు పెంచడం సరికాదని సీఎం స్పష్టం చేశారు. అంతర్జాతీయ పరిస్థితులను కారణంగా చూపి దేశ ప్రజలపై ఆర్థిక ఒత్తిడి మోపడం అన్యాయమన్నారు. ఎన్నికల ముందు ధరలు పెంచబోమని పదేపదే ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల ఫలితాలు వచ్చిన కొద్ది రోజులకే నిర్ణయం మార్చుకోవడం ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయడమేనని విమర్శించారు. ఇది ముమ్మాటికీ విశ్వాస ఘాతుకమని ధ్వజమెత్తారు. కేంద్ర ప్రభుత్వ ఆర్థిక విధానాలపై కూడా సీఎం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. పదేళ్ల పాలనలో రూపాయి విలువ క్షీణించిందని, దేశ ఆర్థిక వ్యవస్థ బలహీనపడిందని ఆరోపించారు. 'ఆత్మనిర్భర్ భారత్' పేరుతో ఇచ్చిన హామీలు కార్యరూపం దాల్చలేదని, చిన్న మరియు మధ్య తరహా పరిశ్రమలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని అన్నారు. యువత ఉపాధి అవకాశాలు తగ్గిపోతుండటం ఆందోళనకరమని పేర్కొన్నారు. దేశాన్ని మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా పేర్కొంటూనే ప్రజలపై ఇంధన ధరల రూపంలో భారాన్ని మోపడం ఎలా సమర్థించుకుంటారని సీఎం ప్రశ్నించారు. ధరల పెంపు నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకుని ప్రజలకు ఉపశమనం కలిగించే చర్యలు చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.



# తెలంగాణలో ఓటర్ల జాబితా సమగ్ర సవరణకు శ్రీకారం

**హైదరాబాద్, మే 16:**

తెలంగాణలో ఓటర్ల జాబితాను సమగ్రంగా సవరించే ప్రత్యేక కార్యక్రమం వచ్చే నెల 15 నుంచి ప్రారంభం కానుందని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి ప్రకటించారు. దాదాపు పావు శతాబ్దం తర్వాత రాష్ట్రంలో ఈ విస్తృత స్థాయి ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియ చేపడుతున్నట్లు వెల్లడించారు. ఓటర్ల వివరాలను కచ్చితంగా నవీకరించడం, తప్పులను సరిదిద్దడం, అర్హులైన ప్రతి ఒక్కరిని జాబితాలో చేర్చడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు.

జూన్ 25 నుంచి జులై 24 వరకు అధికారులు, బూత్ లెవల్ ఆఫీసర్లు (బీఎల్వోలు) ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను పరిశీలిస్తారు. ప్రతి కుటుంబానికి ఎన్యుమరేషన్ ఫామ్‌లు అందజేస్తారు. ప్రతి ఓటర్‌కు రెండు ఫామ్‌లు ఇవ్వబడతాయి. అందులో ఒకటి పూర్తి చేసి తిరిగి బీఎల్వోలకు అందజేయాలి. మరో ఫామ్‌ను రసీదు రూపంలో ఓటరు తమ వద్ద భద్రపరుచుకోవచ్చు. ప్రత్యక్ష ప్రక్రియతో పాటు ఆన్‌లైన్ ద్వారా కూడా నమోదు సదుపాయం కల్పించారు. ఓటర్లు voters.eci.gov.in వెబ్‌సైట్ ద్వారా స్వయంగా తమ వివరాలను నమోదు చేసుకునే అవకాశం ఉంది. అందిన ఫామ్‌లు, నమోదు వివరాల ఆధారంగా జులై 31న ముసాయిదా ఓటరు జాబితాను విడుదల చేస్తారు. ఈ జాబితాను రాజకీయ పార్టీలకు అందించడంతో పాటు ప్రజల పరిశీలన కోసం అధికారిక వెబ్‌సైట్‌లో కూడా ఉంచనున్నారు. ముసాయిదా జాబితాపై జులై 31 నుంచి ఆగస్టు 30 వరకు అభ్యంతరాలు, సవరణలు, ఫిర్యాదులు స్వీకరిస్తారు. అందిన ప్రతి అభ్యర్థనను పరిశీలించిన అనంతరం అక్టోబర్ 1న తుది ఓటరు జాబితా ప్రకటించనున్నారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, ఖచ్చితత్వం పెంచేందుకు ఈ సమగ్ర సవరణ కీలకమని అధికారులు భావిస్తున్నారు. కొత్త ఓటర్ల నమోదు, మరణించిన లేదా మారిన ఓటర్ల వివరాల తొలగింపు వంటి అంశాలు కూడా ఈ ప్రక్రియలో భాగమవుతాయి.

# నాకూ ఓ మంత్రి పదవి ఇవ్వండి

- రాహుల్‌ను కోరిని పరిగి ఎమ్మెల్యే

**న్యూఢిల్లీ, మే 16:**

లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీని కలిసినట్లు పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ కేబినెట్‌లో తనకు అవకాశం కల్పించాలని కోరినట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. ఈ మేరకు రాహుల్ గాంధీకి వినతిపత్రం అందించినట్లు పేర్కొన్నారు. తెలంగాణ కేబినెట్‌లో మ□డు మంత్రి పదవులు ఖాళీగా ఉన్నాయని.. రంగారెడ్డి జిల్లా నుంచి ప్రాతినిధ్యం లేదని రామ్మోహన్ రెడ్డి చెప్పారు. గతంలో రంగారెడ్డి జిల్లాకు ముగ్గురు నుంచి ఆరుగురు మంత్రులు ఉండేవారని ఎమ్మెల్యే గుర్తు చేశారు. డీలిమిటేషన్‌లో భాగంగా జిల్లాలో 44 అసెంబ్లీ నియోజకవర్గాలు, 8 పార్లమెంట్ స్థానాలకు పెరిగే అవకాశం ఉందన్నారు. ఈ కారణంగానే తాను మంత్రి పదవి ఆశిస్తున్నట్లు చెప్పారు. తమ కుటుంబం మ□డు తరాలుగా కాంగ్రెస్ పార్టీలోనే పని చేస్తోందని.. బూత్ స్థాయి నుంచి తాను పని చేసినట్లు గుర్తు చేశారు. నాలుగు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేశానని.. పార్టీ అధికారంలోకి రావాలనే ఏకైక లక్ష్యంతో కృషి చేసినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు మంత్రి పదవి కోసం రాహుల్ గాంధీకి వినతి సమర్పించగా సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తనకు మంత్రి పదవి వచ్చేలా రాహుల్ గాంధీతో మాట్లాడి అవకాశం కల్పిస్తారని ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.

# మలక్‌పేట, ఉప్పుగూడ స్టేషన్లకు పూర్వ వైభవం

**మొదటిపేజీ తరువాయి**

పనులను శనివారం పరిశీలించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. హైదరాబాద్ పాత బస్తీ ప్రాంతంలో జరుగుతున్న రైల్వే స్టేషన్ల ఆధునికీకరణ పనులను పరిశీలించేందుకు మలక్‌పేట్, ఉప్పుగూడ రైల్వే స్టేషన్లను ఈరోజు సందర్శించాను.. పాత బస్తీ ప్రజలకు కూడా దేశంలోని ఇతర నగరాల స్థాయిలో రైల్వే సౌకర్యాలు అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టాం అని చెప్పారు. ప్రయాణికులకు సౌకర్యవంతంగా ఉండేలా లిఫ్టులు, ఎస్కలేటర్లు, విస్తృతమైన ప్లాట్‌ఫారాలు, ప్లాట్‌ఫారం షెల్టర్లు, మెరుగైన పార్కింగ్, సర్క్యులేటింగ్ ఏరియా, ఆధునిక వెయిటింగ్ సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. తాను విద్యార్థిగా ఉన్న రోజుల నుంచే ఉప్పుగూడ, మలక్‌పేట్ స్టేషన్లను ప్రజలు ఎంతగా ఉపయోగించుకునేవారో చూశాను.. ఇప్పుడు మళ్లీ వాటికి పూర్వ వైభవం తీసుకురావడానికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోంది.. పాత బస్తీ ప్రజలు కూడా గర్వపడేలా ఈ స్టేషన్లను అందంగా, ఆధునికంగా తీర్చిదిద్దుతున్నాం అని ఆయన చెప్పారు. హైదరాబాద్ నగరంలో రైల్వే నెట్‌వర్క్ విస్తరణకు కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది.. ఎంఎంటీఎస్ రెండో దశ పనులను వేగవంతంగా ముందుకు తీసుకెళ్తున్నాం.. ఈ ప్రాజెక్టు ద్వారా నగర ప్రజలకు మెరుగైన ప్రజా రవాణా సౌకర్యాలు అందుతాయి.. యాదాద్రి వరకు ఎంఎంటీఎస్ విస్తరణ పనులు కొనసాగుతున్నాయి.. కొమురవెల్లి మల్లన్న భక్తులకు మెరుగైన రవాణా సదుపాయాలు కల్పించేందుకు కొత్త కొమురవెల్లి రైల్వే స్టేషన్‌ను నిర్మించాం.. ఇప్పటికే 100 శాతం పనులు పూర్తయ్యాయి.. ఈ నెల చివరి వారంలో లేదా వచ్చే నెల మొదటి వారంలో ఆ స్టేషన్‌ను ప్రజలకు అంకితం చేయనున్నాం అని మంత్రి కిషన్‌రెడ్డి వివరించారు. ఇప్పటికే సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌ను సుమారు రూ.720 కోట్లతో ప్రపంచ స్థాయి ప్రమాణాలతో అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ తరహాలో సికింద్రాబాద్ స్టేషన్ రూపుదిద్దుకుంటోందని, అదేవిధంగా నాంపల్లి రైల్వే స్టేషన్‌ను కూడా రూ.350 కోట్లతో ఆధునీకరిస్తున్నామని, అక్కడ పనులు వేగంగా కొనసాగుతునాయని తెలిపారు. నగరంలో హఫీజ్‌పేట్, బేగంపేట్, నాంపల్లి, సికింద్రాబాద్, హైటెక్ సిటీ, మలక్‌పేట్, యాకుత్‌పురా, ఉప్పుగూడ, ఉమదానగర్, షాద్‌నగర్, మల్కాజిగిరి, మేడ్చల్ తదితర రైల్వే స్టేషన్లను ఒకేసారి ఆధునికీకరించే కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. నగరంలోని అన్ని ప్రాంతాల ప్రజలకు సమాన అభివృద్ధి అందించడమే తమ లక్ష్యమన్నారు. రైల్వే మౌలిక వసతులు అభివృద్ధి చెందడం ద్వారా ప్రజల ప్రయాణ సౌకర్యాలు మెరుగుపడటంతోపాటు ఆర్థిక కార్యకలాపాలు కూడా పెరుగుతాయన్నారు. ప్రజల సహకారంతో హైదరాబాద్ రైల్వే వ్యవస్థను దేశంలోనే అత్యుత్తమంగా తీర్చిదిద్దుతామని కిషన్‌రెడ్డి చెప్పారు.

# మహిళల ఆర్థిక స్వావలంబనకు వేదిక స్త్రీ నిధి

**మొదటిపేజీ తరువాయి**

సీతక్క అన్నారు. 2011లో ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించిన స్త్రీనిధి నేటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో మరింత బలోపేతం అవుతోందన్నారు. మైక్రో ఫైనాన్స్ సంస్థలు, అధిక వడ్డీ వ్యాపారుల బారిన పడుతున్న మహిళలను ఆదుకోవడానికే స్త్రీ నిధిని ఏర్పాటు చేశామని తెలిపారు. ఇప్పటివరకు స్త్రీ నిధి ద్వారా 32 లక్షల మందికిపైగా మహిళలకు రూ.24 వేల కోట్ల రుణాలు అందించడం గొప్ప విజయమని మంత్రి పేర్కొన్నారు. ప్రజాభవన్‌లో స్త్రీ నిధి వార్షిక కార్యాచరణ ప్రణాళిక అమలు కార్యక్రమం శనివారం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా స్త్రీ నిధి ఉద్యోగులంతా కలిసి స్త్రీ నిధి స్టాఫ్ వెల్ఫేర్ అసోసియేషన్‌ను ఏర్పాటు చేసుకోగా మంత్రి సీతక్క అభినందించారు. సంఘం ఉద్యోగులను ఐక్యం చేయడమే కాక హక్కులతోపాటు బాధ్యతలను కూడా గుర్తు చేస్తుందని పేర్కొన్నారు. ఉద్యోగులు తమ ప్రయోజనాలతో పాటు లక్షలాది మహిళల ఆర్థిక సంక్షేమాన్ని కాపాడాలని కోరారు. స్త్రీ నిధి అసలు సిసలు మాహిళా బ్యాంకు అని కొనియాడారు. రాష్ట్ర మహిళలకు స్త్రీ నిధి ఒక నమ్మకమైన బ్యాంకుగా ఎదగాలని ఆకాంక్షించారు. తెలంగాణ స్త్రీ నిధి మోడల్‌ను ఇతర రాష్ట్రాలు కూడా అనుసరిస్తున్నాయని చెప్పారు. "కోటిమంది మహిళలను కోటీశ్వరులను చేయడం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యం. ఆ దిశగా మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలను రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచాం. మహిళల అభివృద్ధే తెలంగాణ అభివృద్ధి అనే నమ్మకంతో ప్రభుత్వం ముందుకు సాగుతోంది' అని మంత్రి తెలిపారు. దేశ జీడీపీలో మహిళల భాగస్వామ్యం ప్రస్తుతం 18 శాతానికే పరిమితమైందని, అభివృద్ధి చెందిన దేశాల్లో అది 40 శాతానికి చేరుకుందని పేర్కొన్నారు. తెలంగాణ మహిళలు కూడా ఆ స్థాయికి ఎదగాలని, అందుకోసం ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తుందని అన్నారు. చిన్న వ్యాపారాలు, స్వయం ఉపాధి అవకాశాలను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని, ముఖ్యంగా గ్రామీణ మహిళల ఉత్పత్తులకు మార్కెటింగ్ అవకాశాలు కల్పిస్తూ వారి జీవనోపాధిని మెరుగుపరుస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వంలో 16 మంది ఉద్యోగులను తొలగించారని, ఇప్పుడు అదే వ్యక్తులు తప్పుడు ఆరోపణలతో సంస్థను దెబ్బతీయడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. అలాంటి అసత్య ప్రచారాన్ని ఉద్యోగులంతా కలిసి తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. స్త్రీ నిధిని బలోపేతం చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యం తప్ప ఎవరి ఉద్యోగాలను తొలగించడం కాదు అని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. స్త్రీ నిధి సంస్థ ఏర్పాటులో, దాన్ని విజయవంతంగా ముందుకు తీసుకెళ్లడంలో కృషి చేసిన ఎండీ విద్యాసాగర్ రెడ్డిని మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. త్వరలో పదవీ విరమణ చేయనున్న విద్యాసాగర్ రెడ్డిని మంత్రి సీతక్క, ఉద్యోగులు ఘనంగా సన్మానించారు.

నూతన నాయకత్వంలో స్త్రీ నిధి సంస్థ మరింత ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని మంత్రి ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్పెషల్ సీఎస్ దాన కిషోర్, పంచాయతీరాజ్ కమిషనర్ దివ్య దేవరాజన్, స్త్రీ నిధి ఎండీ విద్యాసాగర్ రెడ్డి, డిప్యూటీ ఎండీ శ్రీనాథ్, స్త్రీ నిధి ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# సీనియర్లకు పదవి గండం..! కొత్త ముఖాలకు మంత్రి యోగం..?

**మొదటిపేజీ తరువాయి**

వర్గ నేతకు అవకాశం ఇవ్వొచ్చన్న చర్చ వేడెక్కింది.

ఈ క్రమంలో చింతకుంట విజయ రమణారావు, మదన్ మోహన్ రావు, ప్రేమ్ సాగర్ రావు పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. వీరిలో ప్రభుత్వ విప్‌గా కొనసాగుతున్న విజయ రమణారావుకు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని కాంగ్రెస్ వర్గాలు భావిస్తున్నాయి. సీఎం రేవంత్ రెడ్డికి సన్నిహితుడిగా ఉన్న ఆయనకు మంత్రి పదవి దక్కితే పెద్దపల్లి ప్రాంతానికి తొలిసారి మంత్రి వర్గంలో ప్రాధాన్యం లభించే అవకాశముందని చర్చ సాగుతోంది.

మరోవైపు నిజామాబాద్‌కు చెందిన మదన్ మోహన్ రావు పేరు కూడా బలంగా వినిపిస్తోంది. పార్టీకి జాతీయ స్థాయిలో సేవలు అందిస్తున్న నేపథ్యంలో ఆయనను పరిశీలిస్తున్నట్లు సమాచారం. మంచిర్యాలకు చెందిన ప్రేమ్ సాగర్ రావు పేరు కూడా ప్రచారంలో ఉన్నప్పటికీ ప్రధాన పోటీ విజయ రమణారావు, మదన్ మోహన్ రావుల మధ్యనే ఉందని రాజకీయ వర్గాలు చర్చించుకుంటున్నాయి.

ఇక కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్ పేర్లు కూడా మంత్రి వర్గ మార్పుల చర్చల్లో వినిపిస్తున్నాయి. సీనియర్లను తప్పించి కొత్త వారికి అవకాశం ఇస్తే రాజకీయ సమీకరణాలు మారే అవకాశం ఉందని కాంగ్రెస్ నేతలు అంచనా వేస్తున్నారు. అయితే ప్రస్తుతం జరుగుతున్నవి కేవలం రాజకీయ ప్రచారాలేనని, అధిష్ఠానం నుంచి అధికారిక ప్రకటన వచ్చే వరకు స్పష్టత రాదని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

## ఇంధన ధరలు తగ్గించాలని

# సీపీఐ నిరసన





**తెలంగాణ బ్యూరో:**

పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో శనివారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. సీపీఐ రాష్ట్ర సమితి పిలుపు మేరకు జిల్లా కౌన్సిల్ ఆధ్వర్యంలో సత్యనారాయణ రెడ్డి భవన్ నుంచి హిమాయత్‌నగర్ వై జంక్షన్ వరకు ఖాళీ సిలిండర్, ఆటోకు తాళ్లు కట్టి గుంజుతూ వినూత్నంగా ఆందోళన చేపట్టారు.

ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ తప్పుడు హామీలతో అధికారంలోకి వచ్చిన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్లకు అనుకూలంగా విధానాలు అమలు చేస్తోందని విమర్శించారు. పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరల పెంపుతో సామాన్య ప్రజలపై తీవ్ర భారం పడుతోందని అన్నారు.

దేశ ఆర్థిక వ్యవస్థ ప్రపంచంలో నాలుగో స్థానంలో ఉందని కేంద్ర ప్రభుత్వం ప్రచారం చేసుకుంటూనే ప్రజలకు బంగారం కొనొద్దని, పెట్రోల్ వినియోగం తగ్గించాలని సూచించడం ఆర్థిక సంక్షోభానికి సంకేతమని పేర్కొన్నారు. ప్రజలను నిజాలు చెప్పకుండా అబద్ధపు ప్రచారాలతో మోసం చేస్తున్నారని ఆరోపించారు.

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ హయాంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొన్నారని గుర్తు చేశారు. ప్రస్తుతం పెరుగుతున్న ధరలతో పేద, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు.

కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈటీ నరసింహ, నాయకులు ప్రేమ్ పావని, ఛాయాదేవి, స్టాలిన్, కమతం యాదగిరి, వెంకటేశం, చంద్రమోహన్ గౌడ్, పడాల నళిని, కాంపల్లి శ్రీనివాస్, పల్లె నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# వచ్చే ఏడాది చివరి నాటికి దేవాదుల పూర్తి చేయాలి

**హైదరాబాద్:**

జె.చొక్కారావు దేవాదుల ఎత్తిపోతల పథకం పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి 2027 డిసెంబర్ 31 నాటికి ప్రాజెక్టును పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని రాష్ట్ర సాగునీరు, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. పనుల్లో జాప్యాన్ని ఏమాత్రం సహించబోమని హెచ్చరిస్తూ, నిర్దేశిత గడువులో పనులు పూర్తి చేయాలని కాంట్రాక్ట్ సంస్థలకు స్పష్టం చేశారు.

శనివారం సచివాలయంలో దేవాదుల ప్రాజెక్టు పురోగతిపై నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, దనసరి అనసూయ సీతక్క, ఎంపీ బలరాం నాయక్, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ దేవాదుల తెలంగాణలో అత్యంత ప్రతిష్ఠాత్మక సాగునీటి ప్రాజెక్టులలో ఒకటని పేర్కొన్నారు. గోదావరి నది నుంచి 38.16 టీఎంసీల నీటిని తరలించి ఉత్తర, తూర్పు తెలంగాణలోని 10 జిల్లాల్లో 5.56 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడమే లక్ష్యమన్నారు. హనుమకొండ, వరంగల్, జనగామ, యాదాద్రి భువనగిరి, సూర్యాపేట, సిద్దిపేట, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి, కరీంనగర్ జిల్లాలకు ఈ ప్రాజెక్టు ద్వారా ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు.



200405లో రూ.6,016 కోట్ల అంచనా వ్యయంతో ప్రారంభమైన ఈ ప్రాజెక్టు ప్రస్తుతం రూ.18,400 కోట్లకు చేరిందని మంత్రి వెల్లడించారు. భూసేకరణ, జీఎస్టీ మార్పులు, నిర్మాణ వ్యయాల పెరుగుదల, డిజైన్ సవరణల కారణంగా వ్యయం భారీగా పెరిగిందన్నారు. ఇప్పటివరకు రూ.14,422 కోట్లు ఖర్చు చేశామని, మిగిలిన పనుల కోసం మరో రూ.3,978 కోట్లు అవసరమవుతాయని చెప్పారు. ప్రాజెక్టులో ఇప్పటివరకు 87.70 శాతం భౌతిక పురోగతి సాధించామని అధికారులు వివరించారు. ఆసియాలోనే అతిపొడవైన 49 కిలోమీటర్ల డిషేప్ టన్నెల్ ఇందులో భాగమని తెలిపారు. ఫేజ్ 1, ఫేజ్ 2 పనులు చివరి దశకు చేరుకోగా, ఫేజ్ 3లో కీలక పనులు కొనసాగుతున్నాయని వెల్లడించారు.

ప్రాజెక్టుకు అవసరమైన 34,622 ఎకరాల్లో ఇప్పటికే 31,963 ఎకరాలు సేకరించామని, మిగిలిన 2,659 ఎకరాల భూసేకరణను వేగవంతం చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. అలాగే పనులు పూర్తి చేయని కాంట్రాక్టర్ల ఒప్పందాలను రద్దు చేసి వెంటనే రీటెండర్లు పిలవాలని స్పష్టం చేశారు.

దేవాదుల ప్రాజెక్టు పూర్తయితే లక్షలాది ఎకరాలకు సాగునీటితో పాటు వందల గ్రామాలకు తాగునీటి సౌకర్యం అందుతుందని, దీనికి అవసరమైన నిధులు, సాంకేతిక సహకారం ప్రభుత్వం పూర్తిగా అందిస్తుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.

# పోలీసులకు లొంగిపోయిన భగీరథ

**మొదటిపేజీ తరువాయి**

బండి సంజయ్ మాట్లాడుతూ..'నా కుమారుడు భగీరథ్‌పై పోక్సో కేసు ఆరోపణలు వచ్చాయి. చట్టాలపై ఉన్న గౌరవంతో అడ్వకేట్ల ద్వారా పోలీసుల విచారణకు అప్పగించాను. నేను ఇంతకు ముందే చెప్పా.. చట్టం ముందు నా బిడ్డ అయినా, సామాన్యుడైనా సమానమే. అందరం చట్టాలకి లోబడి ఉండాల్సిందే. మా అబ్బాయి ఏ తప్పూ చేయలేదని పదేపదే చెబుతున్నాడు. వాస్తవానికి ఫిర్యాదు రాగానే స్టేషన్‌లో అప్పగిద్దామని అనుకున్నా. లాయర్లను సంప్రదించి మా వద్ద ఉన్న ఆధారాలను నా కుమారుడు వారి ముందుంచాడు. వాటిని చూసి కేసు కొట్టేస్తారని.. బెయిల్ తప్పకుండా వస్తుందని లాయర్లు చెప్పారు. అందుకే కొంత జాప్యం జరిగింది. ఈరోజు కూడా బెయిల్ వస్తుందనే లాయర్లు చెబుతున్నారు. అయితే ఇంకా జాప్యం చేయడం సరికాదని అనుకున్నా. ఆ ఉద్దేశంతో మా అబ్బాయిని తీసుకొచ్చి లాయర్ల ద్వారా విచారణ కోసం అప్పగించాను. న్యాయ వ్యవస్థపై సంపూర్ణమైన నమ్మకం ఉంది. సోమవారం నాడు కోర్టు ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉన్నప్పటికీ.. న్యాయ వ్యవస్థపై ఉన్న గౌరవంతో ఇంకా ఆలస్యం కావొద్దని విచారణకు అప్పగించా' అని తెలిపారు. అయితే పోలీసుల కథనం మరోలా ఉంది. నార్సింగ్ పోలీస్ అకాడవి□ సవి□పంలో భగీరథను అదుపులోకి తీసుకున్నామని చెబుతున్నారు. అక్కడి నుంచి అతడిని పేటబషీరాబాద్ స్టేషన్‌కు తరలించామని డిసిపి రమేశ్ రెడ్డి వెల్లడించారు.



## భగీరథ్ లొంగిపోయాడా..? పోలీసులే అరెస్ట్ చేశారా..?

**హైదరాబాద్, మే 16:**

మైనర్ బాలికపై లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న బండి భగీరథ్ వ్యవహారంలో కొత్త సందిగ్ధత నెలకొంది. భగీరథ్ పోలీసుల ఎదుట లొంగిపోయినట్లు తొలుత వార్తలు రాగా, అనంతరం పోలీసులు ఆయనను తామే అరెస్ట్ చేసినట్లు ప్రకటించారు.

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ స్పందిస్తూ చట్టానికి లోబడి తన కుమారుడిని న్యాయవాదుల సమక్షంలో పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు. చట్టం అందరికీ సమానమని, న్యాయవ్యవస్థపై పూర్తి విశ్వాసం ఉందని పేర్కొన్నారు. అయితే సైబరాబాద్ పోలీస్ కమిషనర్ రమేష్‌రెడ్డి మాత్రం పోక్సో కేసులో నిందితుడిగా ఉన్న భగీరథ్‌ను నార్సింగి వద్ద ఉన్న పోలీస్ అకాడమీ సమీపంలో అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు. అనంతరం ఆయనను పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. భగీరథ్ అరెస్టు నేపథ్యంలో కూకట్‌పల్లి డీసీపీ రితిరాజ్ హుటాహుటిన పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. మరోవైపు కేసు దర్యాప్తు కోసం సీఎం ఆదేశాల మేరకు డీజీపీ సీవీ ఆనంద్ ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే.

ఒకవైపు కుమారుడిని స్వచ్ఛందంగా అప్పగించామని బండి సంజయ్ చెబుతుండగా, మరోవైపు అరెస్ట్ చేశామని పోలీసులు వెల్లడించడంతో భగీరథ్ లొంగిపోయారా లేదా పోలీసులు పట్టుకున్నారా అన్న అంశంపై స్పష్టత లేకుండా పోయింది.

## కుమారుడి లొంగుబాటుపై బండి సంజయ్ స్పందన

**హైదరాబాద్, మే 16:**

మైనర్ బాలికను వేధించారనే ఆరోపణలతో పోక్సో కేసు ఎదుర్కొంటున్న భగీరథ్ పోలీసుల ఎదుట లొంగిపోవడంతో గత కొన్ని రోజులుగా కొనసాగుతున్న ఉత్కంఠకు తెరపడింది. ఈ నేపథ్యంలో కుమారుడి లొంగుబాటుపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ స్పందించారు.

అందరూ చట్టానికి లోబడి ఉండాల్సిందేనని పేర్కొన్న బండి సంజయ్, చట్టంపై ఉన్న గౌరవంతోనే తన కుమారుడు భగీరథ్‌ను న్యాయవాదుల సమక్షంలో పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు. న్యాయవ్యవస్థపై తమకు పూర్తి విశ్వాసం ఉందని, అదే నమ్మకంతో చట్టపరమైన ప్రక్రియను ఎదుర్కొంటున్నామని చెప్పారు.

భగీరథ్ తాను ఎలాంటి తప్పూ చేయలేదని చెబుతున్నాడని బండి సంజయ్ వెల్లడించారు. కేసుకు సంబంధించిన ఆధారాలను సేకరించి తమ నిర్దోషిత్వాన్ని నిరూపించుకునే ప్రక్రియలో భాగంగానే లొంగుబాటులో కొంత జాప్యం జరిగిందని పేర్కొన్నారు. చట్టం నుంచి తప్పించుకోవాలనే ఉద్దేశం తమకు లేదని, అందుకే అవసరమైన వివరాలతో పోలీసుల ముందుకు వచ్చినట్లు తెలిపారు.

కుమారుడిని చట్టం ముందు ప్రవేశపెట్టిన తర్వాత చట్టం తన పని తాను చేసుకుపోతుందని, న్యాయస్థానాల్లో తమకు న్యాయం జరుగుతుందనే నమ్మకం ఉందని బండి సంజయ్ అన్నారు.

మరోవైపు భగీరథ్ లొంగుబాటుతో కేసు దర్యాప్తులో పోలీసులు తదుపరి చర్యలను వేగవంతం చేశారు.

## 'ఆపరేషన్ ఆక్టోపస్ 3.0'

**మొదటిపేజీ తరువాయి**

30 మందికి నోటీసులు జారీ చేశారు. ఇప్పటికే రెండు విడతల్లో నిర్వహించిన 'ఆపరేషన్ ఆక్టోపస్'లో సైబర్ నేరగాళ్లకు బ్యాంక్ ఖాతాలు సమకూరుస్తున్న వ్యక్తులు, వారికి సహకరిస్తున్న బ్యాంక్ సిబ్బందిపై పోలీసులు దృష్టి సారించారు. ప్రస్తుతం మూడో విడతలో సిమ్ కార్డుల సరఫరా వ్యవస్థను పూర్తిగా ఛేదించడంపై ప్రత్యేక దర్యాప్తు కొనసాగుతోంది.

పలు రాష్ట్రాల్లో ఇంకా సోదాలు కొనసాగుతున్నాయని, మరిన్ని అరెస్టులు జరిగే అవకాశముందని అధికారులు వెల్లడించారు.

## పంట వ్యవర్థాలను కాల్చడంతో ప్రతికూల ప్రభావం

- **రైతులకు అవగాహన కల్పించాలి**
- **వ్యవసాయ శాఖ సంచాలకులు డా. బి. గోపి**

**హైదరాబాద్, మే 16:**

వ్యవసాయ భూముల్లో పంట కోత అనంతరం మిగిలే పంట అవశేషాలను కాల్చివేయడం వల్ల భూసారం, పర్యావరణం మరియు ప్రజారోగ్యంపై తీవ్ర ప్రతికూల ప్రభావాలు పడుతున్నాయని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ సంచాలకులు డా. బి. గోపి తెలిపారు. తాత్కాలిక సౌలభ్యం కోసం పంట వ్యర్థాలను తగులబెట్టడం రైతులకు దీర్ఘకాలంలో ఆర్థిక నష్టాలను కలిగిస్తుందని ఆయన హెచ్చరించారు. వ్యవసాయ శాఖ మంత్రి ఆదేశాల మేరకు, రాష్ట్రంలోని వ్యవసాయ విస్తరణ అధికారులు మరియు వ్యవసాయ అధికారులు పంట అవశేషాల దహనం వల్ల కలిగే నష్టాలపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని సంచాలకులు ఆదేశించారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయి అధికారులకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేయడంతో పాటు రైతులకు పలు ముఖ్య సూచనలు చేశారు. ప్రతి మంగళవారం నిర్వహించే 'రైతు నేస్తం' కార్యక్రమాల్లో పంట అవశేషాల నిర్వహణపై ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించారు. అలాగే, పొలాల్లో పంట వ్యర్థాలను కాల్చకుండా రోటావేటర్తో కలియదున్నడం, వేస్ట్ డీకంపోజర్ వినియోగం వంటి ప్రత్యామ్నాయ పద్ధతులను పాటించాలని రైతులను కోరారు.ల్గ□తులు పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని, భూమి ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ సుస్థిర వ్యవసాయం దిశగా ముందుకు సాగాలని డా. బి. గోపి ఆకాంక్షించారు.

## ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక

**హైదరాబాద్, మే 16:**

ప్రజా పాలన `ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఈనెల 18 తేదీ నుండి 23వ తేదీ వరకు నిర్వహించే యువజన, క్రీడా, పర్యాటక వారోత్సవాలను విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. మే 18 నుండి 23 వ తేదీ వరకు నిర్వహించే కార్యక్రమాల నిర్వహణపై స్పెషల్ సిఎస్‌లు జయేష్ రంజన్, వాణి ప్రసాద్ లతో కలసి శనివారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయం నుండి జిల్లా కలెక్టర్లతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సవి□క్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, యువతలో క్రీడా స్ఫూర్తి, దేహదారుఢ్యం, సామాజిక చైతన్యం, ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించేందుకై ఈ కార్యక్రమాలను చేపట్టినట్టు తెలిపారు. అదేవిధంగా పర్యాటక ప్రాంతాలపై ప్రజల్లో పెద్ద ఎత్తున చైతన్యం కల్పించాలని, పర్యాటక ప్రాంతాలను ప్రజలు సందర్శించేలా తగు చర్యలు చేపట్టాలని అన్నారు. ప్రధానంగా స్పోర్ట్స్ కార్యక్రమాలను రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిలో నిర్వహించాలన్నారు. ప్రతీ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, క్రీడాకారులు, యువజన సంఘాలను భాగస్వామ్యం చేయాలన్నారు. ఈనెల 18న నిర్వహించే 'ఫిట్` తెలంగాణా థీమ్ తో రాష్ట్ర, జిల్లా కేంద్రాలలో 5ఐ రన్, అదే విధంగా అన్నిమండల కేంద్రాలలోవ్వాకథాన్, యోగ తదితర కార్యక్రమాలను నిర్వహించాలన్నారు.

## ప్రజలు మళ్లీ కేసీఆర్ ప్రభుత్వాన్నే తీసుకొస్తారు

- **కాంగ్రెస్, బీజేపీలపై కేటీఆర్ విమర్శలు**
- **ప్రత్యేక ఓటర్ల సవరణపై అప్రమత్తంగా ఉండాలని పిలుపు**
- **దొంగ ఓట్లు, డబుల్ ఓట్లపై దృష్టి పెట్టాలని సూచన**
- **సనత్‌నగర్ కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ వ్యాఖ్యలు**
- **పార్టీ శ్రేణులు జాగ్రత్తగా వ్యవహరించాలని తలసాని సూచన**



**తెలంగాణ బ్యూరో:**

రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా ప్రజావ్యతిరేక కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు తిరస్కరించి మళ్లీ కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వాన్నే అధికారంలోకి తీసుకువస్తారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. శనివారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన సనత్‌నగర్ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ ప్రత్యేక ఓటర్ల సవరణ కార్యక్రమాన్ని బీజేపీ దేశవ్యాప్తంగా వివాదాస్పదంగా మార్చిందని ఆరోపించారు. తమకు వ్యతిరేకంగా ఉన్న పార్టీల ఓటర్ల పేర్లను జాబితాల నుంచి తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. తెలంగాణలో అలాంటి పరిస్థితులు రాకుండా బీఆర్ఎస్ కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

పార్లమెంట్ ఎన్నికల తర్వాత బీజేపీ కేవలం సోషల్ మీడియాలో మాత్రమే కనిపిస్తోందని, సమాజంలో ఆ పార్టీ ప్రభావం పెద్దగా లేదని వ్యాఖ్యానించారు. హైదరాబాద్ నగరంలో ఉన్న దొంగ ఓట్లు, డబుల్ ఓట్లను గుర్తించి తొలగించేలా పార్టీ శ్రేణులు పని చేయాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత హైదరాబాద్‌లో కూల్చివేతలు తప్ప అభివృద్ధి కనిపించడం లేదని కేటీఆర్ విమర్శించారు. తాగునీటి సరఫరా, దోమల నియంత్రణ వంటి కనీస సమస్యలను కూడా ప్రభుత్వం పరిష్కరించలేకపోతోందన్నారు.

మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ ప్రత్యేక ఓటర్ల సవరణ కార్యక్రమంపై పార్టీ నాయకులు, బూత్ లెవెల్ ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఓటర్ల పేర్లు తొలగిపోకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు.

జూన్ 1 నుంచి పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభమవుతుందని, అనంతరం పార్టీ కమిటీల ఏర్పాటు చేపడతామని తెలిపారు. సమావేశంలో తలసాని సాయి కిరణ్ యాదవ్, నామన శేషుకుమారి, కొలన్ లక్ష్మీ, అత్తిలి అరుణ గౌడ్, మహేశ్వరి, ఆకుల రూప తదితరులు పాల్గొన్నారు.

## బీఎల్ఏల నియామకాలపై కాంగ్రెస్ ఫోకస్

- **ఎస్ఐఆర్ ప్రక్రియపై నేతలకు దిశానిర్దేశం**
- **జూమ్ సమావేశాల్లో టీపీసీసీ కీలక సూచనలు**
- **మండల కమిటీలను త్వరగా పూర్తి చేయాలని ఆదేశం**
- **పార్లమెంట్ వారీగా నేతలతో సమీక్ష నిర్వహణ**

**తెలంగాణ బ్యూరో:**

బూత్ లెవెల్ ఏజెంట్ల నియామకాలు, ఎస్ఐఆర్ ప్రక్రియ, పార్టీ సంస్థాగత నిర్మాణంపై రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ శనివారం జూమ్ సమావేశాలు నిర్వహించింది. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశాల్లో ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నియోజకవర్గ ఇంచార్జ్‌లు, కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా నిర్వహించిన ఈ సమావేశాల్లో ప్రధానంగా బీఎల్ఏల నియామకాలపై చర్చ జరిగినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ప్రతి నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో బూత్ లెవెల్ ఏజెంట్ల నియామకాన్ని పూర్తి చేయాలని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ నేతలకు సూచించారు.

ఎస్ఐఆర్ ప్రక్రియపై పార్టీ నేతలు అప్రమత్తంగా ఉండాలని, ప్రతి నియోజకవర్గంలో బీఎల్ఏల జాబితాను డీసీసీల ద్వారా కలెక్టర్లకు అందించాలని ఆదేశించారు. అలాగే మండల అధ్యక్షుల నియామకాలను త్వరగా పూర్తి చేసి మండల కమిటీలను బలోపేతం చేయాలని సూచించారు.

టీపీసీసీ చీఫ్‌తో జరిగిన సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ కూడా పాల్గొన్నారు. హైదరాబాద్‌లోని మంత్రి నివాసంలో జిల్లా ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలతో సమావేశమైన ఆయన, కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో పార్టీ సంస్థాగత బలోపేతంపై చర్చించారు.

మండలాల వారీగా పార్టీ సమావేశాలు నిర్వహించాలని, ఎస్ఐఆర్ ప్రక్రియపై నియోజకవర్గ ఇంచార్జ్‌లు, కోఆర్డినేటర్లు ప్రత్యేక దృష్టి పెట్టాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు.

## ఫామ్‌హౌజ్‌లో ఇద్దరు వృద్ధ మహిళల హత్య

**రంగారెడ్డి, మే 16:**

మొయినాబాద్ ఫామ్‌హౌస్‌లో దారుణ ఘటన వెలుగు చూసింది. ఇద్దరు మహిళలను గుర్తుతెలియని వ్యక్తులు అతి దారుణంగా హత్య చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. హత్యకు గురైన వారి మృతదేహాలను పరిశీలించారు. అయితే, మృతులను తాండూరులో అదృశ్యమైన ఇద్దరు వృద్ధులుగా పోలీసులు గుర్తించారు. వీరి వయసు దాదాపు 60 సంవత్సరాలు ఉంటుందని భావిస్తున్నారు. బాధితులను వికారాబాద్ నుంచి తీసుకొచ్చి ఫామ్‌హౌస్‌లో హత్య చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. గ్□నాన్స్ డబ్బుల విషయంలోనే వీరి హత్య జరిగినట్లు భావిస్తున్నారు. డబ్బు ఇస్తామని పిలిచి అత్యంత దారుణంగా హత్య చేసినట్లు తెలుస్తోంది.

## ఆర్డీఓ ఎదుటే హత్యాయత్నం

**సిద్దిపేట, మే 16:**

సిద్దిపేట ఆర్డీఓ కార్యాలయంలో భూవివాద విచారణ సందర్భంగా తండ్రీకొడుకులపై జరిగిన దాడి తీవ్ర కలకలం రేపింది. డివిజనల్ ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ హోదాలో ఉన్న అధికారి సమక్షంలోనే ప్రత్యర్థులు విచక్షణారహితంగా దాడికి పాల్పడిన ఘటన స్థానికంగా చర్చనీయాంశమైంది. సిద్దిపేట పట్టణ శివారులోని సర్వే నెంబర్ 1440లో ఉన్న 104 ఎకరాల భూమి ఉమ్మడి ఆస్తి పంపకాలలో భాగంగా నాయకం మల్లయ్యకు దక్కినట్లు బాధితులు తెలిపారు. 1993 నుంచి రెవెన్యూ రికార్డుల్లో భూమి తన పేరిటే ఉందని మల్లయ్య పేర్కొన్నారు. అయితే ఇటీవల తన సోదరుడు లక్ష్మణ్ ఈ భూమిపై ఆర్డీఓ వద్ద అప్పీల్ దాఖలు చేయడంతో విచారణకు హాజరైనట్లు తెలిపారు. శనివారం విచారణ సందర్భంగా మల్లయ్య తన కుమారుడు నాయకం ప్రసాద్‌తో కలిసి ఆర్డీఓ కార్యాలయానికి వెళ్లారు. విచారణ కొనసాగుతున్న సమయంలో ప్రత్యర్థులు శ్రీనివాస్, లక్ష్మణ్, సత్యనారాయణలు ఒక్కసారిగా వారిపై దాడికి దిగినట్లు ఆరోపించారు. ప్రసాద్ గొంతు నులిమి చంపేందుకు ప్రయత్నించారని, కార్యాలయం బయటకు లాక్కెళ్లి మరింత దాడి చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దాడి సమయంలో ప్రసాద్ పురుషాంగాలపై తీవ్రంగా కొట్టడంతో పాటు, వృద్ధుడైన మల్లయ్యను కూడా తోసిపుచ్చి దాడి చేసినట్లు బాధితులు తెలిపారు. ఈ ఘటన మొత్తం ఆర్డీఓ సమక్షంలోనే జరిగినప్పటికీ ఎవరూ అడ్డుకోలేదని ఆరోపించారు. డివిజనల్ ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ హోదాలో ఉన్న అధికారి ముందే ఇలాంటి ఘటన జరగడం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఘటనను అడ్డుకునేందుకు కార్యాలయ సిబ్బంది తక్షణ చర్యలు తీసుకోలేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ఘటనపై బాధితుడు నాయకం ప్రసాద్ సిద్దిపేట వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తమకు ప్రాణహాని ఉందని, నిందితులపై హత్యాయత్నం కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.

# ప్రధాని మోదీకి కవిత లేఖ

- **బండి సంజయ్‌ను బర్తరఫ్‌కు డిమాండ్**
- **నిష్పక్షపాత దర్యాప్తు కోసం పదవి నుంచి తప్పించాలని విజ్ఞప్తి**
- **హోంశాఖలో కొనసాగితే విచారణపై ప్రభావం ఉంటుందనే ఆరోపణ**
- **ప్రజా విశ్వాసం కాపాడేందుకు తక్షణ నిర్ణయం అవసరమని వ్యాఖ్య**
- **కుమారుడిపై పోక్సో కేసు నేపథ్యంలో లేఖ రాసిన తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు**

**తెలంగాణ బ్యూరో, మే 16 :**

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ను మంత్రివర్గం నుంచి తక్షణమే తొలగించాలని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కె. కవిత ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు. బండి సంజయ్ కుమారుడు భగీరథ్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదైన నేపథ్యంలో, దర్యాప్తు నిష్పక్షపాతంగా సాగాలంటే ఆయన పదవిలో కొనసాగడం సరికాదని పేర్కొన్నారు.

కేంద్ర మంత్రివర్గ నైతిక బాధ్యతలు, ప్రజా విశ్వాసం, చట్టపరమైన పారదర్శకత దృష్ట్యా ఈ అంశంపై వెంటనే స్పందించాలని కవిత విజ్ఞప్తి చేశారు. చట్ట అమలు సంస్థలపై ప్రభావం చూపే హోంశాఖ వంటి కీలక విభాగంలో కొనసాగడం వల్ల కేసు దర్యాప్తు స్వేచ్ఛ దెబ్బతినే అవకాశం ఉందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు.

మైనర్‌పై లైంగిక దాడి ఆరోపణలకు సంబంధించిన ఈ కేసులో విచారణ పూర్తిగా స్వతంత్రంగా, పారదర్శకంగా, రాజకీయ ప్రభావం లేకుండా జరగాలని కవిత స్పష్టం చేశారు. న్యాయవ్యవస్థపై ప్రజల విశ్వాసం నిలబెట్టాలంటే ఈ కేసులో ఎలాంటి అనుమానాలకు తావులేకుండా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు.





విచారణ పూర్తయ్యే వరకు బండి సంజయ్‌ను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి పదవి నుంచి తప్పించాలని ఆమె డిమాండ్ చేశారు. మైనర్ల భద్రత, మహిళల రక్షణ, న్యాయ పరిరక్షణ అంశాల్లో కేంద్రం రాజీపడదన్న స్పష్టమైన సందేశం ఇవ్వాలంటే ఇదే సరైన చర్య అవుతుందని పేర్కొన్నారు.

ఈ నెల 8న 17 ఏళ్ల బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా భగీరథ్‌పై భారతీయ న్యాయ సంహిత, పోక్సో చట్టంలోని సంబంధిత సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారం రాజకీయంగా మరింత ప్రాధాన్యం సంతరించుకుంది.



సంపాదకీయం

# ఆర్థిక కార్యాచరణ అత్యవసరం!

నాలుగు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు ముగిశాక బిజెపిలో కనిపించినంత ఆనందం మిగతా పార్టీల్లో కనిపించలేదు. కేరళలో అధికారం దక్కించుకున్నా కూడా కాంగ్రెస్ లో అంతటి ఆనందం కనిపించలేదు. బెంగాల్ దక్కడంతో బిజెపిలో ఎక్కడలేని ఆనందం, ఉత్సాహం కనిపించింది. ఆ ఆనందాన్ని ప్రజలతో పంచుకునేందుకు బిజెపి సిద్దంగా లేదు. ఎందుకంటే పెట్రో,డీజిల్ ధరలు పెంచడం, ఆర్థిక వ్యవస్థ రోజురోజుకూ కుదేలవ్వడంతో ప్రజల్లో ఒకింత నిరాసక్తి కనిపిస్తోంది. కొత్తగా రెండు రాష్ట్రాల్లో బీజేపీ అధికారంలోకి వచ్చింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ ఆనందంలో ఉండగానే దేశ ఆర్థిక వ్యవస్థ తీవ్ర కష్టనష్టాల నెదుర్కొంటున్న వాస్తవాన్ని గుర్తించారు. హైదరాబాద్ పర్యటనలో ఆయన చేసిన వ్యాఖ్యలు రానున్న ముప్పును ముందే గమనించి చేసిన హెచ్చరికగా గుర్తించాలి. ఈ క్రమంలో ఒక్క బంగారం దిగుమతులే కాకుండా దేశీయ వ్యవసాయ రంగాన్ని దెబ్బతీస్తున్న ఆహార దిగుమతులను కూడా నిలిపి వేయడం మంచిదని ప్రధాని ఎంత త్వరగా గుర్తిస్తే అంత మంచిది. ఆర్థిక వ్యవస్థ రానున్న రోజుల్లో మరింత బలహీనం కానుందన్న కఠోర సత్యాన్ని మోడీ ఒప్పుకున్నారు. ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు చేసిన తప్పులకు ప్రజలు త్యాగాలు చేయాలని ప్రధానమంత్రి పిలుసపునిస్తున్నట్లుగా ఉంది. అందువల్ల రాజకీయ నాయకులకు సంబంధించి విప్లవాత్మక మార్పులు తీసుకుని వస్తే తప్ప సంక్షోభాన్ని గట్టెక్కలేమని ప్రధాని మోడీ గుర్తించడం లేదు. ఇరాన్‌పై అమెరికా,ఇజ్రాయెల్ సంయుక్త దాడులతో మొదలు పెట్టిన యుద్ధం ప్రారంభమై ఈ నెలాఖరుకు మూడు నెలలు పూర్తవుతాయి. ఫిబ్రవరి 28న మొదలైన ఈ యుద్ధం ఇప్పట్లో ముగుస్తుందనడానికి లేదు. ట్రంప్ రోజుకో మాట మాట్లాడుతున్నారు. ఆయన తీరు చూస్తుంటే యుద్ధం ఆగిపోయే సూచనలు కానరావడం లేదు. పశ్చిమాసియాలోని దేశాలన్నీ ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఆ యుద్ధంలో పాల్గొంటూనే ఉన్నాయి. ఈ క్రమంలో చమురు సరఫరా నిలిచి పోయింది. హోర్ముజ్ జలసంధి వద్ద అమెరికా ,ఇరాన్‌లు పట్టుబిగించాయి. బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 107 డాలర్లుగా ఉన్నది; రూపాయి మారకం విలువ డాలర్‌కు రూ.96కు చేరువలో ఉన్నది. రూపాయి విలువ ఎన్నడూ ఇంతగా పతనం కాలేదు. నిత్యం దాని ధర పతనం అవుతూనే ఉంది. దీనికి కారణం ఇబబడిముబ్బడిగా దిగుమతులే కారణమని చెప్పనక్కరలేదు. విదేశీ మారక నిల్వలు తగ్గిపోతున్నాయి. అధికారికంగా వినియోగ ధరల సూచీ ద్రవ్యోల్బణం 3.5శాతం కాగా ఆహార ద్రవ్యోల్బణం 4.33శాతంగా ఉంది. గృహావసరాల ఎల్పీజీ సిలిండర్ ధర రూ.913 కాగా కమర్షియల్ సిలిండర్ ధర రూ.3077 నుంచి రూ.3237 దాకా ఉంటోంది; డబ్ల్యూపీఐ ద్రవ్యోల్బణం 8.3శాతంగా ఉంది. ఇవన్నీ కూడా మన ఆర్థిక దౌర్బల్యాన్ని సూచిస్తున్నాయి. నేరుగా ఇవన్నీ ప్రజలపై తీవ్ర ప్రభావం చూపుతున్నవని గుర్తించాలి. దీనిని తట్టుకుని నిలబడేందుకు ధరలు పెంచడం మార్గం కాదు. ప్రజల్లో కొనుగోలు శక్తి పెరగడానికి చర్యలు తీసుకోవడం లేదు. దేశీయంగా ఆహార వస్తువులను ప్రజలకు నేరుగా, చౌకగా అందించే ప్రణాళికలు చేయడం లేదు. తెలుగు రాష్ట్రాలను తీసుకుంటే ఇక్కడ వరి, మిర్చి, శనగ,మక్కజొన్న తదితర పంటలు విపరీతంగా పండుతున్నాయి. ఇవి పండిస్తున్న రైతులకు గిట్టుబాటు ధరలు దక్కడం లేదు. అలాగే కొనుగోలుదారులకు సరసమైన ధరలకు వస్తువులు దక్కడం లేదు. ఈ వ్యత్యాసాన్ని ప్రభుత్వాలు గుర్తించడం లేదు. బంగారం దిగుమతులను నిలిపివేయడంతో పాటే ఇతర నిత్యావసరాల దిగుమతులను కూడా నిలిపివేయాలి. దేశీయంగా పండుతునున్న పంటలకు పోటీగా వస్తున్న ఆహారా ధాన్యాల దగుమతులపై ఆంక్షలు విధించాలి. అలాగే మనవద్ద గోదాముల్లో మూలుగుతున్న ఆహార ధాన్యాలను ఉచితంగా కాకుండా ప్రజలకు సరసమైన ధరలకు అందించాలి. అలాగే అన్ని విషయాలలోను పొదుపు పాటించి తీరాలి. ఇంధన వినియోగం, వంటనూనెలు, ఎరువులు మొదలైన వాటి వినియోగంలో పొదుపు అవసరమే. అందుకోసం అనవసర దిగుమతులను పూర్తిగా నిరోధించాలి. అనినింటికి మించి ప్రజాప్రతినిధుల దుబారాలపై ఆంక్షలు విధించాలి. జీతభత్యాలు, ఉచిత పథకాలపైనా కొంతకాలం ఆంక్షలు విధించాలి. ఈ విషయంలో పాలకులు ముఖ్యంగా ప్రధాని మోడీ ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరం ఉంది. అడ్డూ అదుపూ లేకుండా ఇంధన వినియోగానికి కారణ మవుతున్న కాన్వాయ్‌లను రద్దు చేయాలి. దేశ ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు విదేశీ మారకద్రవ్యం నిల్వలను మళ్లీ సమృద్ధం చేయడానికి కఠిన చర్యలు అవలంబించాల్సిందే. ఇవన్నీకూడా ఎమర్జెన్సీ కింద అమలు కావాలి. రూపాయి మారకం రేటును స్థిరీకరించకుంటే మన విదేశీమారక నిల్వలు హరించకు పోతాయి. అందుకోసం రూపాయి మారకం రేటు స్థిరపరచేందుకు అసవరమైన చర్యలను తక్షణం అమలు చేయాలి. దేశ ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సమిష్టి నిర్ణయాలు అవసరం. ఆర్థిక నిపుణులతో చర్చించాలి. క్షేత్రస్థాయిలో ప్రజల నుంచి సూచనలు సలహాలు తీసుకోవాలి. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి కఠిన చర్యలకు ఉపక్రమించాలి. తక్షణ ప్రాతిపదికన చేపట్టవలసిన చర్యలపై సలహాలు ఇచ్చేందుకు తలపండిన ఆర్థికవేత్త నేతృత్వంలో ఒక నిపుణుల బృందాన్ని ఏర్పాటు చేయాలి. ఇలా గ్రామాల నుంచి పట్టణాల వరకు నిరంతరంగా అభిప్రాయాలను సేకరించి, క్రోడీకరించాలి. మన దేశ వనరులు, వినియోగం, దిగుమతులను విశ్లేషించాలి. ఎక్కడ ఖర్చులు తగ్గించవచ్చో అన్నది ప్రజలతో పాటు, మేధావుల నుంచి సూచనలు స్వీకరించాలి. అప్పుడే మనకు ఒక పరిష్కారం దొరుకుతుంది. అంతే తప్ప కాన్వాయ్‌లలో ఒకటి రెండు కార్లను తగ్గించడం వల్ల దేశ ఆర్థిక వ్యవస్థ చక్కబడదని ప్రధాని మోడీ త్వరగా గుర్తిస్తే మంచిది.

# సెమీకండక్టర్లు, డిజిటల్ రంగంలో భారత్ దూకుడు

- 4 యూనికార్న్ సంస్థల నుంచి 100 సంస్థలు
- భారతీయ సంస్కృతి చిరస్మరణీయం
- ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ
- నెదర్లాండ్స్‌లో మోదీకి బ్రహ్మరథం
- 'ది హేగ్' నగరంలో ప్రవాసీయుల స్వాగతం



**న్యూఢిల్లీ, మే 16:** భారతదేశం అన్ని రంగాలలో అభివృద్ధి సాధిస్తూ ప్రపంచంలోనే అత్యంత వేగంగా దూసుకుపోతోందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. నెదర్లాండ్స్ పర్యటనలో భాగంగా 'ది హేగ్' నగరంలో ఏర్పాటు చేసిన ఘన సాంస్కృతిక ప్రదర్శనల మధ్య ఆయన ప్రవాస భారతీయులతో ముఖాముఖి (మాటామంతీ) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్న ఎన్‌ఆర్‌ఐలపై ప్రధాని ప్రశంసల జల్లు కురిపించారు. ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న డిజిటల్ చెల్లింపుల్లో భారతదేశమే అగ్రస్థానంలో నిలిచిందని ప్రధాని గర్వంగా ప్రకటించారు. ప్రస్తుతం దేశంలో నెలకు 20 బిలియన్ డాలర్ల విలువైన డిజిటల్ లావాదేవీలు జరుగుతున్నాయని వెల్లడించారు. ఒకప్పుడు దేశంలో కేవలం 4 యూనికార్న్ సంస్థలు మాత్రమే ఉండేవని, ప్రస్తుతం ఆ సంఖ్య 100కు పైగా చేరిందని వివరించారు. టెక్నాలజీ పరంగా దేశం సాధిస్తున్న ప్రగతికి ఇది నిదర్శనమన్నారు. సెమీకండక్టర్ల తయారీ రంగంలోనూ భారత్ శరవేగంగా ముందడుగు వేస్తోందని ప్రధాని స్పష్టం చేశారు. దేశంలో ఇప్పటికే సెమీకండక్టర్ ప్లాంట్ల పనులు ముమ్మరంగా సాగుతున్నాయని, 'మేడిన్ ఇండియా' చిప్‌లు కూడా తయారవుతున్నాయని చెప్పారు. భారతదేశం విజయవంతంగా నిర్వహించిన ఏఐ సమ్మిట్, జీ20 సమావేశాలు దేశ సమర్థతను ప్రపంచానికి చాటిచెప్పాయన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రధాని మాట్లాడుతూ.. భారతదేశంలో ప్రస్తుతం 90 కోట్ల మంది ఓటర్లుగా నమోదయ్యారని, 2024 లోక్‌సభ ఎన్నికల్లో రికార్డు స్థాయిలో 64 కోట్ల మంది ఓటు వేశారని గుర్తు చేశారు. ఈయూ దేశాల మొత్తం జనాభాను కలిపినా కూడా 64 కోట్ల మంది ఉండరని, భారత ప్రజాస్వామ్య గొప్పతనం అటువంటిదని మోదీ అభివర్ణించారు. ప్రవాస భారతీయుల ఉత్సాహాన్ని చూసి తాను విదేశంలో ఉన్నాననే సంగతి మరిచిపోయి, స్వదేశంలో ఏదో ఉత్సవానికి హాజరైనట్లు అనిపించిందని ప్రధాని భావోద్వేగానికి గురయ్యారు. "కాలక్రమేణా ఎన్నో సంస్కృతులు కనుమరుగయ్యాయి, కానీ భారతదేశ విభిన్న సంస్కృతి ఇప్పటికీ మన హృదయాల్లో బలంగా ఉంది. తరాలు మారినా, దేశాలు మారినా మన మట్టి పరిమళం, కుటుంబ విలువలు ఎన్నడూ మారలేదు" అని కొనియాడారు. నెదర్లాండ్స్ సమాజానికి మరియు అక్కడి ఆర్థిక వ్యవస్థకు ప్రవాస భారతీయులు అందిస్తున్న సేవలను ఆ దేశ పాలకులే స్వయంగా ప్రశంసిస్తుంటారని, ఇది ప్రతి భారతీయుడికి గర్వకారణమని మోదీ పేర్కొన్నారు.

**మలుపు తిప్పిన మే 16:**

సరిగ్గా 12 ఏళ్ల క్రితం.. 2014 మే 16 ఇదే రోజున లోక్‌సభ ఎన్నికల ఫలితాలు వెలువడి దశాబ్దాల తర్వాత దేశంలో సంపూర్ణ మెజారిటీతో ఒక స్థిరమైన ప్రభుత్వం ఏర్పడిందని ప్రధాని గుర్తు చేసుకున్నారు. నాటి నుండి కోట్లాది మంది భారతీయులు తనపై ఉంచిన నమ్మకమే తనను అలసిపోకుండా, ఆగకుండా ముందుకు నడిపిస్తోందని ప్రధాని నరేంద్ర మోదీ పునరుద్ఘాటించారు.

# ఉగ్రవాదులను ఉసికొల్పితే అంతే సంగతులు

## ప్రపంచ పటంలో పాక్ ఉండదు

## పాక్‌కు ఆర్మీ చీఫ్ ద్వివేదీ హెచ్చరిక



**న్యూఢిల్లీ, మే 16:** ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పిస్తూ భారత్‌పై దాడులు కొనసాగిస్తే ప్రపంచపటంలో పాకిస్థాన్ అస్తిత్వమే ప్రమాదంలో పడుతుందని ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది హెచ్చరించారు. భౌగోళికంగా ఉండాలా లేక చరిత్రలో కలిసిపోవాలా అనేది పాకిస్థాన్ తేల్చుకోవాలని వార్నింగ్ ఇచ్చారు. భారత్‌పై దాడులు చేసే ఉగ్రవాద సంస్థలకు మద్దతు ఇవ్వడం ఆపాలని ఆయన పాక్‌ను హెచ్చరించారు. దేశ భద్రత విషయంలో భారత్ ఎలాంటి రాజీకీ వెళ్లదని, అవసరమైతే కఠిన చర్యలు తీసుకునేందుకు భారత సైన్యం సిద్ధంగా ఉందని ఉపేంద్ర ద్వివేది పేర్కొన్నారు. ఉగ్రవాదులను, వారి మద్దతుదారులను భారత్ ఒకే విధంగా పరిగణిస్తుందని, అందరిపై కఠిన చర్యలు తీసుకుంటుందని పునరుద్ఘాటించారు. అలాగే గతేడాది పహల్గాం దాడికి ప్రతిస్పందనగా నిర్వహించిన 'ఆపరేషన్ సిందూర్' గురించి కూడా ద్వివేది మాట్లాడారు. పాకిస్థాన్‌లోని ఉగ్ర స్థావరాల ఉనికిని 'ఆపరేషన్ సిందూర్' ద్వారా ప్రపంచానికి తెలియజేశాం. ఉగ్ర స్థావరాలకు సంబంధించిన ఆధారాలు అందజేశాం. పాకిస్థాన్ ఇప్పటికైనా తన తీరు మార్చుకోవాలి. ఆపరేషన్ సిందూర్ రెండో వెర్షన్ మరింత తీవ్ర స్థాయిలో ఉంటుంది. భారత ప్రభుత్వం ఎప్పుడూ దేశ పౌరుల రక్షణ, శ్రేయస్సు విషయంలో రాజీ పడదు. తన మార్గంలో ఎవరైనా అడ్డంకులు సృష్టిస్తే దీటుగా స్పందిస్తుంది' అని ద్వివేది తేల్చి చెప్పారు. ఒవకేళ పాకిస్థాన్ ఉగ్రవాదులను పోషించి, వాళ్లను ఇండియా మీదకు ఉసి గొల్పుతే, అప్పుడు ఆ దేశం ఈ భూమ్మీద ఉండాలా లేదా అన్న అంశాన్ని వాళ్లే నిర్ణయించు కోవాల్సి ఉంటుందన్నారు. చరిత్రలో ఆ దేశానికి స్థానం ఉండాలంటే ఉగ్రవాదులను పెంచి పోషించరాదన్నారు. మానేక్‌షా సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఒకవేళ ఆపరేషన్ సింధూర్ చేపట్టడానికి దారి తీసిన పరిస్థితులు మళ్లీ వస్తే ఏం చేస్తారని ఆయన్ను ప్రశ్నించారు. జనరల్ ద్వివేది తన వ్యాఖ్యల్లో పాకిస్తాన్‌కు నేరుగా వార్నింగ్ ఇచ్చారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ఇండియా నిలుస్తుందన్నారు. గత ఏడాది మే 7వ తేదీన పాక్‌పై ఆపరేషన్ సింధూర్ చేపట్టిన విషయం తెలిసిందే. పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో ఉన్న ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేశారు. ఆ తర్వాత పాక్ దాడులు చేసినా.. ఇండియా వాటిని తిప్పికొట్టింది. సుమారు 88 గంటల పాటు రెండు దేశాలు యుద్ధం కొనసాగించాయి. మే 10వ తేదీ రెండు దేశాల మధ్య కాల్పుల విరమణ జరిగింది.



# ఐసిస్ అగ్ర ఉగ్రవాది హతం

## నైజీరియాతో కలిసి మట్టుబెట్టిన అమెరికా దళాలు..

## 'ఐసిస్ గ్లోబల్ నెట్‌వర్క్‌కు భారీ దెబ్బ' : ట్రంప్

**వాషింగ్టన్, మే 16:** అంతర్జాతీయ ఉగ్రసంస్థ ఐసిస్‌కు చెందిన మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాది అబూ బిలాల్ అల్ మినూకీని అమెరికా, నైజీరియా సంయుక్త బలగాలు హతమార్చాయి. ఈ విషయాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధికారికంగా ప్రకటించారు. ఐసిస్ సంస్థలో రెండో అత్యున్నత స్థాయిలో ఉన్న మినూకీ ప్రపంచవ్యాప్తంగా ఉగ్ర కార్యకలాపాలను సమన్వయం చేస్తున్నాడని ట్రంప్ వెల్లడించారు. ఆఫ్రికాలో దాక్కుంటే ఎవరూ గుర్తించలేరని అతడు భావించినా, అమెరికా గూఢచార సంస్థలు అతడి కదలికలను నిరంతరం గమనించాయని తెలిపారు. "అబూ బిలాల్ ఇకపై ఆఫ్రికా ప్రజలను భయభ్రాంతులకు గురిచేయలేడు. అమెరికా లక్ష్యాలపై దాడుల ప్రణాళికలకు సహకరించలేడు" అని ట్రంప్ పేర్కొన్నారు. ఈ ఆపరేషన్ విజయవంతం కావడంలో సహకరించిన నైజీరియా ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నైజీరియాలో జన్మించిన మినూకీ 'ఇస్లామిక్ స్టేట్ వెస్ట్ ఆఫ్రికా ప్రావిన్స్'లో కీలక కమాండర్‌గా పనిచేశాడు. ఉగ్రవాద సెల్స్‌కు మార్గనిర్దేశం చేయడం, అంతర్జాతీయ నిధులను మళ్లించడం వంటి కార్యకలాపాల్లో అతడు కీలక పాత్ర పోషించినట్లు అమెరికా ఆరోపించింది. ఇప్పటికే 2023లో అమెరికా అతడిని అంతర్జాతీయ ఉగ్రవాదిగా ప్రకటించింది. తాజా ఆపరేషన్‌తో ఐసిస్ గ్లోబల్ నెట్‌వర్క్‌కు భారీ దెబ్బ తగిలిందని అమెరికా వర్గాలు భావిస్తున్నాయి.

# నీట్ పేపర్ లీక్ కేసు

## పుణెకు చెందిన బాటనీ టీచర్ మనీషా అరెస్ట్

**పుణె, మే 16:** నీట్ పేపర్ లీక్ కేసులో మరో కీలక సూత్రధారి, పుణెకు చెందిన బోటనీ టీచర్ మనీషా మందారేను సీబీఐ అరెస్ట్ చేసింది. బోటనీ విభాగంలో సీనియర్ అధ్యాపకురాలు మనీషాను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నీట్ పక్రియలో స్జబెక్ట్ ఎక్స్‌పర్ట్‌గా నియమించింది. ఏప్రిల్ నుంచి ఆమె కొందరు నీట్ అభ్యర్థులకు తన ఇంటి వద్దే శిక్షణా తరగతులను నిర్వహించారు. ఆ సమయంలోనే ఆమె వారికి నీట్ పరీక్షకు సంబంధించిన బోటనీ, జువాలజీ పేపర్లలోని ప్రశ్నలను లీక్ చేశారు. ఆమె లీక్ చేసిన ప్రశ్నలు మే 3వ తేదీన జరిగిన నీట్ పరీక్షలోని ప్రశ్నలతో సరిపోలినట్టు సీబీఐ అధికారులు వెల్లడించారు . ఇప్పటికే ఈ కేసులో పుణెకు చెందిన కెమిస్ట్రీ లెక్చరర్ పీవీ కులకర్ణిని కూడా సీబీఐ అరెస్ట్ చేసింది. కులకర్ణి గత కొన్నేళ్లుగా నీట్ ప్రశ్నాపత్రం రూపొందించే అధికారిక నిపుణుల కమిటీలో సభ్యుడిగా ఉన్నారు. కాగా, నీట్ ప్రశ్నాప్రతం లీకేజీ వ్యవహారంలో ఇప్పటివరకు ఢిల్లీ, జైపూర్, నాసిక్, పుణె, గురుగ్రామ్, అహిల్యానగర్ నుంచి తొమ్మిది మందిని సీబీఐ అరెస్ట్ చేసింది.

# విదేశీ పర్యటనలపై పన్నుపై మోడీ స్పందన

## అలాంటిదేమీ లేదంటూ ఎక్స్‌లో పోస్ట్



**న్యూఢిల్లీ, మే 16:** విదేశీ పర్యటనలపై కూడా కేంద్ర ప్రభుత్వం పన్ను లేదా సర్‌చార్జ్ విధించేందుకు యోచిస్తోందంటూ వచ్చిన వార్తలపై ప్రధాని నరేంద్ర మోదీ ఎక్స్ వేదికగా స్పందించారు. ఆ కథనంలో నిజమనేదే లేదని తేల్చి చెప్పారు. పశ్చిమాసియా ఘర్షణలతో ముడిచమురు ధరలు పెరగడం, రూపాయి మారకం విలువ అంతకంతకూ పతనం అవుతున్న నేపథ్యంలో ఆర్థిక రంగంపై ఒత్తిడి తగ్గించేందుకు ప్రభుత్వం విదేశీ పర్యటనలపై తాత్కాలికంగా పన్ను విధించేందుకు యోచిస్తోందని సీఎన్‌బీసీఒక కథనాన్ని ప్రసారం చేసింది. ఈ కథనంపై ప్రధాని ఘాటుగా స్పందించారు. 'ఇది పూర్తిగా అసత్యం. ఈ కథనంలో వాస్తవమనేదే లేదు. విదేశీ పర్యటనలపై ఆంక్షలు విధించే ప్రశ్నే లేదు. వ్యాపార నిర్వహణ, ప్రజల జీవనాన్ని మరింత సౌకర్యవంతంగా మార్చేందుకు మేము కట్టుబడి ఉన్నాము' అని ప్రధాని ఎక్స్ వేదికగా స్పష్టతనిచ్చారు. ప్రధాని పోస్టు తరువాత ఆ వార్తా ఛానల్ కూడా తన కథనాన్ని ఉపసంహరించుకుంది.

# బొద్దింక వ్యాఖ్యలపై సీజేఐ వివరణ

## తన అభిప్రాయాలను వక్రీకరించిందంటూ మీడియాపై ఆగ్రహం

**న్యూఢిల్లీ, మే 16:** యువతపై చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదం కావడంతో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ వివరణ ఇచ్చారు. తన వ్యాఖ్యలను ఓ వర్గం మీడియా వక్రీకరించి ప్రచారం చేసిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దేశ యువతను విమర్శించినట్టు ప్రచారం చేయడం పూర్తిగా నిరాధారమని స్పష్టం చేశారు. శుక్రవారం విచారణకు వచ్చిన ఓ కేసు సందర్భంగా తాను చేసిన వ్యాఖ్యలు తప్పుగా అర్థం చేసుకున్నారని సీజేఐ తెలిపారు. బోగస్ డిగ్రీలతో లీగల్ వృత్తిలోకి ప్రవేశించి వ్యవస్థను దెబ్బతీసే వ్యక్తుల గురించే తాను వ్యాఖ్యానించానని చెప్పారు. అలాంటి వారు మీడియా, సోషల్ మీడియా, ఇతర వృత్తుల్లోకి చొరబడుతున్నారని, వారినే 'పరాన్నజీవులు'గా అభివర్ణించానని వివరించారు. కానీ దాన్ని దేశ యువతపై విమర్శలుగా చిత్రీకరించడం బాధ కలిగించిందన్నారు. దేశ యువతపై తనకు ఎంతో గౌరవముందని, అభివృద్ధి చెందిన భారత నిర్మాణంలో యువత కీలక శక్తిగా నిలుస్తోందని సూర్యకాంత్ పేర్కొన్నారు. యువత ప్రతిభ, కృషి పట్ల తాను ఎప్పుడూ గర్వపడుతుంటానన్నారు. ఇక సీనియర్ అడ్వకేట్ హోదా కోరుతూ ఒక న్యాయవాది వేసిన పిటిషన్ విచారణ సందర్భంగా ఈ వ్యాఖ్యలు వెలువడ్డాయి. సీజేఐ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చి ధర్మాసనం ముందు కేసు విచారణకు రాగా, పిటిషనర్ ప్రవర్తనపై సీజేఐ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఫేస్‌బుక్ పోస్టుల్లో వాడిన భాషను ప్రస్తావిస్తూ, వృత్తిపరమైన ప్రమాణాలు పాటించని వారికి సీనియర్ హోదా ఇవ్వలేమని వ్యాఖ్యానించారు. కొంతమంది న్యాయవాదుల డిగ్రీల ప్రామాణికతపై కూడా అనుమానాలు ఉన్నాయని, అవసరమైతే సీబీఐ విచారణ కోరే పరిస్థితి వస్తుందని సీజేఐ హెచ్చరించారు. అనంతరం పిటిషనర్ కోర్టుకు క్షమాపణ చెప్పి కేసును ఉపసంహరించుకునేందుకు అనుమతి కోరగా, ధర్మాసనం ఆమోదించింది.



# కాలనీలలో సిసి రోడ్లు నిర్మించండి

## కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవి

**మేడిపల్లి, పీర్జాదిగూడ డివిజన్ల మౌలిక వసతుల సమస్యలపై జోనల్ కమిషనర్‌కు తుంగతుర్తి రవి వినతి పత్రం**

**మేడిపల్లి, రాజముద్ర న్యూస్:** మేడిపల్లి, పీర్జాదిగూడ డివిజన్లలోని పలు కాలనీలు ఎదుర్కొంటున్న తీవ్రమైన మౌలిక వసతుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ పీర్జాదిగూడ మున్సిపల్ అధ్యక్షులు తుంగతుర్తి రవి శనివారం ఉప్పల్ జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా తుంగతుర్తి రవి మాట్లాడుతూ, మేడిపల్లి, పీర్జాదిగూడ డివిజన్ల పరిధిలోని ధరణి కాలనీ, పర్వతాపూర్ బి పి ఎం గ్రీన్ ల్యాండ్స్ కాలనీలతో పాటు పలు కాలనీల ప్రజలు కనీస వసతులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీలలో అస్తవ్యస్తంగా మారిన డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరించాలి. మురుగునీరు రోడ్లపైకి రాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని,గుంతలమయంగా మారిన అంతర్గత రహదారులకు తక్షణమే మరమ్మతులు చేపట్టి, కొత్త సీసీ రోడ్లను నిర్మించాలని, వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని అన్ని కాలనీలకు క్రమబద్ధంగా, స్వచ్ఛమైన తాగునీటిని సరఫరా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ చంద్రశేఖర్ చింతం ,వైస్ ప్రెసిడెంట్ గోపిరెడ్డి కృష్ణ రెడ్డి, జాయింట్ సెక్రటరీ జగతి శ్రీనివాస్, జలగం శరత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ అందే విధంగా చర్యలు

- సంఘం బలోపేతమే లక్ష్యంగా కార్యక్రమం నిర్వహణ
- టి యు డబ్ల్యు జే ఐజేయు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు చలసాని శ్రీనివాసరావు



**సూర్యాపేట,రాజముద్ర న్యూస్:** జర్నలిస్టుల భద్రత, గుర్తింపు, వృత్తిపరమైన రక్షణ కోసం టియుడబ్ల్యూజే–ఐజేయు సంఘం జర్నలిస్టుల పక్షాన బలంగా నిలబడే ఏకైక సంఘం అని టీయూడబ్ల్యూజే ఐజేయు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు చలసాని శ్రీనివాసరావు అన్నారు. తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ – ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (టియుడబ్ల్యూజే–ఐజేయు) ఆధ్వర్యంలో శనివారం మోతే, ఆత్మకూర్ (ఎస్)మండల కేంద్రంలో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. సూర్యాపేట జిల్లాలో సభ్యత్వ నమోదుకు విశేష స్పందన వచ్చిందని వివరించారు. గ్రామీణ, మండల స్థాయిలో పనిచేసే జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం సంఘం నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు. మండల స్థాయి నుంచే సంఘాన్ని బలోపేతం చేయాలనే ఉద్దేశంతోనే ఈ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టాం" అని ఆయన తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న ఈ సభ్యత్వ నమోదు కార్యక్రమం ద్వారా మరిన్ని మండల, జిల్లా కమిటీలను బలోపేతం చేసి, జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు సన్నద్ధమవుతున్నామని చలసాని శ్రీనివాసరావు వెల్లడించారు.జర్నలిస్టుల సంక్షేమం అభివృద్ధి కోసం కృషి చేసే ఏకైక సంఘం టి యు డబ్ల్యు జే ఐజేయు అని స్పష్టం చేశారు. జిల్లావ్యాప్తంగా జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరుతూ త్వరలో జిల్లా మంత్రులు అధికారులను కలవనున్నట్లు వివరించారు.రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలలో మెజారిటీ అక్రిడిటేషన్ సభ్యులుగా టి యు డబ్ల్యు జే ఐజేయు యూనియన్ వారే ఉన్నారని,అర్హులైన జర్నలిస్టులు అందరికీ అక్రిడిటేషన్ అందే విధంగా కృషి చేస్తామని చెప్పారు.అక్రిడిటేషన్ విషయంలో కొన్ని యూనియన్లు జర్నలిస్టులను గందరగోళ పరిచే విధంగా ప్రవర్తించడానికి తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టియుడబ్ల్యూజే–ఐజేయు సూర్యాపేట జిల్లా ప్రధానకార్యదర్శి డాక్టర్ కృష్ణ బంటు,జిల్లా నాయకులు, రెబ్బ విజయ్ కుమార్, గుడిపూరి రామకృష్ణ, పులుసు నాగరాజు, షేక్ రషీద్ ఖాన్, షేక్ జహీర్ తో పాటు మండలంలోని పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు. కొత్తగా సభ్యత్వం పొందిన జర్నలిస్టులకు సంఘం తరఫున సంపూర్ణ మద్దతు ఉంటుందని జిల్లా నాయకులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల సీనియర్ జర్నలిస్టు ఉపేందర్, ధరావత్ రామకృష్ణ,పల్లె లక్ష్మణ్, కందిబండ గోపి,గుణగంటి నాగరాజు, గుండా సురేష్, ఎల్ ఎన్ రాజు తదితరులు పాల్గొన్నారు.తదుపరి ఆత్మకూరు ఎస్ మండల కేంద్రంలో నిర్వహించిన సభ్యత్వం నమోదు కార్యక్రమంలో మండల విలేకరులు జలగం మల్లయ్య, మేడి కృష్ణ, దేవరకొండ సుధాకర్ తదితరులకు సభ్యత్వం అందజేశారు.

# సమగ్ర భూ సర్వేకు కాకరవాయి పైలెట్

**రైతుల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా ప్రభుత్వం అడుగులు: ఆర్డీవో ఎన్. శ్రీనివాస్**



**ఖమ్మం, రాజముద్ర న్యూస్:** తిరుమలాయపాలెం మండలంలోని కాకరవాయి గ్రామాన్ని సమగ్ర భూ సర్వే నిర్వహణకు పైలెట్ ప్రాజెక్టుగా ప్రభుత్వం ఎంపిక చేసింది. ఈ మేరకు శుక్రవారం గ్రామంలో భూ సర్వేపై అవగాహన సదస్సు నిర్వహించారు.సదస్సులో ప్రత్యేక అధికారిగా పాల్గొన్న ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్ మాట్లాడుతూ, "గ్రామంలో ఉన్న భూ సమస్యలను పారదర్శకంగా పరిష్కరించేందుకు ఈ సమగ్ర భూ సర్వే ఎంతో ఉపయోగపడుతుంది. ఎన్నో సంవత్సరాలుగా భూములు కొనుగోలు చేసినప్పటికీ కేవలం అనుభవదారులుగానే మిగిలిపోయిన రైతులకు, ఇప్పుడు పూర్తి స్థాయి యజమాన హక్కులు పొందే అవకాశం కలుగుతుంది" అని తెలిపారు. ఆదివారం నుంచి కాకరవాయి గ్రామంలో క్లస్టర్ల వారీగా సమగ్ర భూ సర్వే చేపట్టనున్నట్లు అధికారులు వెల్లడించారు. రైతులు తమకు సంబంధించిన పాత పత్రాలు, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు, పాస్‌బుక్‌లు తదితర ఆధారాలతో సర్వే బృందాలకు సహకరించాలని ఆర్డీవో కోరారు. గ్రామ సర్పంచ్ గూడూరు ఉపేందర్ మాట్లాడుతూ, "గ్రామంలోని ప్రతి రైతు ఈ సర్వే కార్యక్రమంలో పాల్గొని అధికారులకు సహకరించాలి. సమగ్ర భూ సర్వేతో భూ వివాదాలు తగ్గి రైతులకు స్పష్టమైన హక్కులు లభిస్తాయి" అని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ లూథర్ విల్సన్, డిప్యూటీ తహసీల్దార్ సుధీర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు పవన్ కుమార్, లక్ష్మణ్, గ్రామ పంచాయతీ కార్యదర్శి అంజయ్య గౌడ్, తిరుమలాయపాలెం ఆత్మ కమిటీ డైరెక్టర్ ఉప్పునూతల నాగేశ్వరరావు, ఆర్‌ఐలు, గ్రామ పరిపాలన అధికారులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు కట్టూకూరి శ్రీనివాస్ రెడ్డి, గుండాల లింగయ్య, నల్లగట్టు శ్రీనివాస్, నల్లగట్టు ఉపేందర్, గుండాల వెంకన్న, కొత్తపల్లి వెంకన్న, దంతాల బాలరాజు, భూక్యా శ్రీనివాస్, నల్లగట్టు శంకర్, గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.

# దివ్యాంగ విద్యార్థులకు జీవనోపాకరణాలు అందజేత



**రామారెడ్డి రాజముద్ర న్యూస్:** కామారెడ్డి జిల్లాలోని కళాభారతి యందు తెలంగాణ సమగ్ర శిక్ష విద్యాశాఖ, భారతీయ జీవనోపకరణాల తయారీ సంస్థ వారి సమన్వయంతో జిల్లాలోని వివిధ మండలాలలో గల వివిధ రకాల వైకల్యాలు గల విద్యార్థులకు మండల విద్యాశాఖ అధికారి ఆనంద్ రావు, పర్యవేక్షణలో గత సంవత్సరం ఆగస్టులో డాక్టర్ల పర్యవేక్షణలో నిర్ధారణ చేయబడిన వారికి జీవనఉపకరణాలను అందించడం జరిగినది ఈ కార్యక్రమంలో భాగంగా రామారెడ్డి మండలంలోని వివిధ గ్రామాల నుండి వచ్చిన 9 మంది వివిధ రకాల దివ్యాంగత్వం గల విద్యార్థులకు ముఖ్య అతిథి గ్రంథాలయ చైర్మన్ చంద్రకాంత్ రెడ్డి , కామారెడ్డి మున్సిపల్ చైర్ పర్సన్ అలాగే వైస్ చైర్పర్సన్ జిల్లా విద్యాశాఖ అధికారి జిల్లా దివ్యాంగ విద్యార్థుల సమన్వయకర్త నాగేందర్, వేణు శర్మ , కామారెడ్డి మండల విద్యాశాఖ అధికారి సమక్షంలో ఈ ఉపకారణాలను పంపిణీ చేయడం జరిగింది రామరెడ్డి మండలంలోని గోకుల్ తండా, ఇసనపల్లి ,రామారెడ్డి, కన్నాపూర్ ,రెడ్డిపేట్, రెడ్డి పెట్ తండా గ్రామాలకు చెందిన దివ్యాంగ విద్యార్థులకు జీవనోపకరణాలను అందించి వాటిని ఉపయోగించే విధానం వాటి వల్ల కలిగే ప్రయోజనాలను క్లుప్తంగా తల్లిదండ్రులకు విద్యార్థుల సమక్షంలో వివరించి చూపించడం జరిగింది ఈ కార్యక్రమంలో రామరెడ్డి భవిత పాఠశాలప్రత్యేక ఉపాధ్యాయులు రమేష్, శశి కుమార్, సృజన పాల్గొన్నారు.

# రైతులు పంట అవశేషాలను కాల్చవద్దు

## ఏడిఏ ఎం.సతీష్




**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** రైతులు పంట అవశేషాలను తగలబెట్టడం వల్ల పర్యావరణ కాలుష్యంతో పాటు,నేల ఆరోగ్యం కూడా దెబ్బతింటుందని కూసుమంచి డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు మిట్టపల్లి సతీశ్ అన్నారు.తిరుమలాయపాలెం మండలంలోని బచ్చోడు,తాళ్ళచెరువు గ్రామాల్లో శనివారం రైతులకి అవశేషాలను కాల్చడం, ఫార్మర్ రిజిస్ట్రీ,ఆయిల్ పామ్ సాగు పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక టన్ను వరిగడ్డి కాల్చడం వల్ల 5.5 కిలోల నత్రజని, 2.3 కిలోల భాస్వరం, 25 కిలోల పొటాషియం, 1.2 కిలోల సేంద్రియ కార్బన్ కోల్పోవడం జరుగుతుందని తెలిపారు.అదేవిధంగా 60 కిలోల కార్బన్ మోనాక్సైడ్, 1460 కిలోల కార్బన్ డయాక్సైడ్, 199 కిలోల బూడిద, 2 కిలోల సల్ఫర్ డయాక్సైడ్ వాతావరణంలోకి విడుదలై వాయు కాలుష్యం అవుతుందన్నారు.భూమిలో ఉన్న ఉపయోగకరమైన సూక్ష్మజీవులు చనిపోవడమే కాక,భూమిలోని తేమశాతం కూడా తగ్గుతుందని వెల్లడించారు. అదే విధంగా రైతులు ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకోవాలని లేనియెడల కేంద్ర ప్రభుత్వం పథకాల లబ్ధి చేకూరదని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏఈఓ లు కళ్యాణ్,దివ్య, సీనియర్ కాంగ్రెస్ నాయకులు రామసహాయం అరవింద్ రెడ్డి,

# మైనర్ బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన బండి సాయి భగీరథను వెంటనే అరెస్టు చేసి శిక్షించాలి

## పి ఓ డబ్ల్యు పాలేరు డివిజన్ కార్యదర్శి గోకినపల్లి సరోజిన




**ఖమ్మం, రాజముద్ర న్యూస్:** మైనర్ బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన బండి సాయి భగీరథను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ అనుబంధ ప్రగతిశీల మహిళా సంఘం (పి .ఓ .డబ్ల్యు) పాలేరు డివిజన్ కార్యదర్శి గోకినపల్లి సరోజిని మాట్లాడుతూ కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి అయినా బండి సంజయ్ కుమారుడు కావటం వల్ల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చట్టాలు p చుట్టాలుగా మారాయని వెంటనే కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేసి భేషరతుగా కొడుకుని పోలీసు వ్యవస్థ గొప్ప చెప్పాలని సరోజిని అన్నారు. దేశంలో రాష్ట్రంలో మహిళలపై నిత్యం అఘాయిత్యాలు జరుగుతున్నా ప్రభుత్వాలు వీటిని అరికట్టడంలో విఫలం ఇవ్వడమే కాకుండా ఉన్నోడిదే చట్టం అన్న చందంగా ఉన్నవాడు ఏమి చేసినా పట్టించుకునే నాథుడే కరువయ్యారని అందులో భాగంగానే తెలంగాణ రాష్ట్రంలో బండి సాయి భగీరథ మైనర్ బాలిక పై చేసిన లైంగిక దాడి సమాజానికంతటికి తెలిసినప్పటికీ ప్రభుత్వాలు అధికారులు బండి భగీరథు ని అరెస్ట్ చేయడంలో జాప్యం జరుగుతున్నది దీనికంతటికి కారణం భగీరథకు బిజెపి పార్టీ రాజకీయ పలుకుబడి ఉండడమే మరియు ధనవంతులకు, పేదలకు, తేడాల వల్ల ఇది జరుగుతుందని మేము భావిస్తున్నాం దేశంలో రాష్ట్రంలో జరిగే అగ్రైత్యాలను ప్రభుత్వాలు అరికట్టడంలో చొరవ తీసుకోవాలని ప్రజలకు రక్షణగా ఉండాలని కోరుతున్నాం ఈ లైంగిక దాడిలో పాల్గొన్న బండి భగీరథను వెంటనే అరెస్టు చేసి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని సరోజినీ అన్నారు.

# ఎస్సీ కాలనీలో నీటి ఎద్దడి సమస్యకు పరిష్కారం



**రాజముద్ర న్యూస్, గుడిహత్నూర్:** మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో చాలా కాలంగా వేధిస్తున్న తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. తీవ్రమైన ఎండల నేపథ్యంలో కాలనీలో ఏర్పడిన నీటి ఎద్దడిని నివారించేందుకు సర్పంచ్ ఆడే శీల ప్రత్యేక చొరవ తీసుకున్నారు. కాలనీవాసులు ఎదుర్కొంటున్న నీటి సమస్యను దృష్టిలో ఉంచుకుని తాగునీటి సరఫరా మెరుగుపడేలా అవసరమైన శాశ్వత ఏర్పాట్లు చేయించారు. దీంతో కాలనీవాసులు ఊరట పొందారు. తమ కాలనీలో నెలకొన్న నీటి ఎద్దడిని పూర్తిగా పరిష్కరించిన సర్పంచ్ ఆడే శీలకు కాలనీ ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఆడే క్రాంతి, కల్లేపల్లి దేవేందర్, పంచాయతీ సిబ్బంది మోసిన్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# బండి సాయి భగీరథ్‌ను వెంటనే అరెస్ట్ చేయాలి

## కాగజ్‌నగర్‌లో బీఆర్ఎస్ మహిళా విభాగం ధర్నా



**రాజముద్ర న్యూస్, కాగజ్‌నగర్:** బండి సంజయ్‌ను వెంటనే బర్తరఫ్ చేసి, బండి సాయి భగీరథ్‌పై తక్షణ చర్యలు తీసుకొని అరెస్ట్ చేయాలని బీఆర్ఎస్ పార్టీ మహిళా విభాగం నాయకురాళ్లు డిమాండ్ చేశారు. డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆదేశానుసారం కాగజ్‌నగర్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ బాధ్యతాయుతంగా ప్రభుత్వం వ్యవహరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మున్సిపల్ కౌన్సిలర్లు, మహిళా నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# విఆర్ కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి

## ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**రాజముద్ర న్యూస్, మేడ్చల్ జిల్లా ప్రతినిధి;**

చర్లపల్లి డివిజన్ పరిధిలోని వీఆర్ కాలనీలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పర్యటించారు. కాలనీలో నెలకొన్న పలు స్థానిక సమస్యలను ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లగా, వాటిని శ్రద్ధగా విన్న ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కాలనీలో రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణ వంటి అంశాలపై ఎమ్మెల్యే సమీక్ష నిర్వహించారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యమని పేర్కొంటూ, అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను సూచించారు. స్థానిక ప్రజలు ఎమ్మెల్యేకు తమ సమస్యలను వివరించగా, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు కె. శంకరయ్య , ప్రధాన కార్యదర్శి పి. నాగిరెడ్డి వర్కింగ్ ప్రెసిడెంట్ జి. శ్రీధర్ రెడ్డి ఆర్గనైజింగ్ సెక్రటరీ వి. వేణు గోపాల్ జాయింట్ సెక్రటరీ ఎన్. రాజు,ఖజాంచి ఎస్. రవి కుమార్ సలహాదారు కె. శంకర్ రావు కాలనీ సభ్యులు కృష్ణ కుమారి యు. సత్యమ్మ ఎస్. ఉదయ్ కుమార్ టి. ఆనంద్ కె. అంజని కుమార స్వామి డి. కృష్ణ, కె. కిషన్, జి. ప్రసాద్, పి. సందీప్ బి, సందీప్, వై. రాజు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వాసవి సేవాసమితి ఆధ్వర్యంలో అమావాస్య అన్నదాన కార్యక్రమం

**రాజముద్ర న్యూస్, గజ్వేల్ టౌన్;**

సిద్దిపేట జిల్లా గజ్వేల్ లో అమావాస్య అన్నప్రసాద వాసవి సేవాసమితి ఆధ్వర్యంలో కీర్తిశేషులు చందా నర్సమ్మ, వజ్రమ్మ దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారుల సౌజన్యంతో అమావాస్య అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కొమరవెల్లి ఆలయ డైరెక్టర్ నంగునూరి సత్యనారాయణ మాట్లాడుతూ అమావాస్య రోజున అన్నదానం చేస్తే పుణ్యం లభిస్తుందని దాదాపు 77 నెలలుగా ప్రతి నెల అమావాస్య అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, ఇందుకు సహకరిస్తున్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చందా లక్ష్మయ్య,శేఖరయ్య,నాగభూషణం, కొండ పోచమ్మ దేవస్థానం మాజీ డైరెక్టర్ అయిత సత్యనారాయణ, రుక్మయ్య, సిద్ధి రామచంద్రం,కైలాస ప్రశాంత్,ఉమేష్, లచ్చుల్, సిద్ధి రామచంద్రం,ఉప్పల చంద్ర శేఖర్, గందే సంతోష్ తదితరులు పాల్గొన్నారం.



# కాలువలను పట్టించుకోని లస్కర్లు

- పూడిక, నాచుతో దర్శనమిస్తున్న వైనం
- లస్కర్లు కూడా ఆఫిసర్లే...
- కంప్లైంట్ వస్తేనే పట్టించుకుంటామంటున్న అధికారులు..
- ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించాలని రైతుల వేడుకోలు

**ఖమ్మం, రాజముద్ర న్యూస్:** వ్యవసాయానికి ప్రాణాధారమైన సాగునీటి కాలువలు ప్రస్తుతం నిర్వహణ లోపంతో కొట్టుమిట్టాడుతున్నాయి. పొలాలకు సాఫీగా నీరందించాల్సిన కాలువలు నాచు, చెత్తాచెదారంతో నిండిపోయి దర్శనమిస్తున్నాయి. కాలువల నిర్వహణను పర్యవేక్షించాల్సిన 'లస్కర్లు' (కాలువల కావలివాళ్లు/సిబ్బంది) తమ విధులను విస్మరించడంతో రైతాంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోంది.

**పేరుకుపోయిన నాచు.. నిలిచిపోయిన నీటి ప్రవాహం**

చాలా కాలంగా కాలువలను శుభ్రం చేయకపోవడంతో లోపల భారీగా నాచు పేరుకుపోయింది. దీనికి తోడు ప్లాస్టిక్ వ్యర్థాలు, పూడిక చేరి నీటి ప్రవాహానికి తీవ్ర అడ్డంకిగా మారాయి. కాలువల్లో నీరు ఉన్నప్పటికీ, ఈ నాచు కారణంగా నీరు ముందుకు సాగని పరిస్థితి నెలకొంది. దీనివల్ల చివరి ఆయకట్టు రైతులకు సకాలంలో సాగునీరు అందడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**కాలువ గట్లపై అడవిని తలపిస్తున్న చెట్లు**



మరోవైపు, కాలువ ఇరుపక్కలా భారీ ఎత్తున పిచ్చిమొక్కలు, ముళ్లపొదలు, పెద్ద పెద్ద చెట్లు పెరిగిపోయాయి. ఇవి కాలువ లోపలికి వంగిపోవడంతో నీటి ప్రవాహం మరింత మందగిస్తోంది. అంతేకాకుండా, ఈ పొదల కారణంగా కాలువ గట్లు బలహీనపడి, ఎప్పుడు ఎక్కడ గండి పడుతుందోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. విషసర్పాలకు, పురుగులకు ఇవి నివాసాలుగా మారడంతో కాలువ గట్ల వెంట నడవడానికి కూడా రైతులు భయపడుతున్నారు.

**లస్కర్ల నిర్లక్ష్యంపై ఆగ్రహం.**

పేరుకే లస్కర్లు 15 మంది.. కానీ కాలువ వైపు చూసేవారే లేరు" అని స్థానిక రైతులు మండిపడుతున్నారు. కాలువల్లో ఎక్కడైనా అడ్డంకులు ఉంటే తొలగించడం, నీటి ప్రవాహాన్ని క్రమబద్ధీకరించడం, కాలువలను శుభ్రంగా ఉంచడం లస్కర్ల ప్రధాన బాధ్యత. కానీ, క్షేత్రస్థాయిలో లస్కర్లు అసలు పనులే చేయడం లేదనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. విధులకు హాజరుకాకుండా నిర్లక్ష్యం వహిస్తున్నా, ఉన్నతాధికారులు వారిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

**తక్షణమే చర్యలు చేపట్టాలి**

ప్రస్తుతం సాగు సీజన్ ప్రారంభమవుతున్న తరుణంలో కాలువల పరిస్థితి ఇలాగే ఉంటే పంటలు ఎండిపోయే ప్రమాదం ఉంది. కాబట్టి, సంబంధిత నీటిపారుదల శాఖ (ఇరిగేషన్) అధికారులు తక్షణమే స్పందించాలి.

**నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న లస్కర్లపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలి.**

యుద్ధప్రాతిపదికన కాలువల్లోని నాచును, పూడికను తొలగించాలి. గట్లపై ఉన్న భారీ చెట్లను, పొదలను నరికివేసి నీటి ప్రవాహానికి మార్గం సుగమం చేయాలి.అధికారులు, ప్రజాప్రతినిధులు ఇప్పటికైనా స్పందించి, కాలువలకు పూర్వవైభవం తీసుకువచ్చి తమ పంటలను కాపాడాలని రైతులు కోరుతున్నారు.

# ప్రమాదానికి ఆహ్వానమా..?

- విద్యుత్ తీగల కింద భారీ లోడ్ ధాన్యం లారీ
- సెస్ ఏఈ నిర్లక్ష్యంపై స్థానికుల ఆగ్రహం

**రాజముద్ర న్యూస్, గంభీరావుపేట:** గంభీరావుపేట మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై ధాన్యం బస్తాలతో భారీగా లోడ్ చేసిన లారీ విద్యుత్ తీగలకు అత్యంత సమీపంగా ప్రయాణించడం స్థానికుల్లో ఆందోళన కలిగించింది. భారీ ఎత్తులో బస్తాలు లోడ్ చేయడంతో ఏ క్షణమైనా ప్రమాదం జరిగే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. భారీ లోడ్ వాహనాల సంచారం ప్రజల ప్రాణాలకు



ముప్పు కలిగిస్తుందని స్థానికులు లారీ డ్రైవర్‌ను ప్రశ్నించారు. ఈ క్రమంలో డ్రైవర్, స్థానికుల మధ్య వాగ్వాదం చోటుచేసుకొని కొట్టుకునే పరిస్థితి ఏర్పడింది. ఆగ్రహానికి గురైన డ్రైవర్ లారీని నడిరోడ్డుపై నిలిపివేయడంతో కొంతసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఈ ఘటనపై స్థానికులు సెస్ ఏఈ ఆనంద్ కుమార్‌కు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చినా ఆయన స్పందించలేదని తెలిపారు. సంబంధిత అధికారులు సమస్యను పట్టించుకోవడం లేదని స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ఇరువర్గాలకు నచ్చజెప్పి పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. అంతేకాకుండా ప్రధాన రహదారులపై విద్యుత్ తీగలు ప్రమాదకర స్థాయిలో వేలాడుతున్నప్పటికీ వాటిని సరిచేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పలుమార్లు ఫిర్యాదు చేసినా స్పందన లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యుత్ తీగల సమస్యను వెంటనే పరిష్కరించి ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరుతున్నారు.

# డెంగ్యూ రహిత గ్రామంగా మార్చడమే లక్ష్యం

- సిట్ లో సీనియర్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ను చేర్చాలి
- బతిమాలడం మానేసి అరెస్ట్ చేయండి
- బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్



**రాజముద్ర న్యూస్, భీంపూర్:** ప్రజాపాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా శనివారం భీంపూర్ మండలం పిప్పల్‌కోటి గ్రామంలో డెంగ్యూ వ్యాధిపై ప్రజలకు విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్ దాసరి రమేష్, సబ్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ సాదాబ్ ఉమెరా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్పంచ్ దాసరి రమేష్ మాట్లాడుతూ వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో గ్రామస్తులంతా అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. దోమల పెరుగుదల నివారించేందుకు ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. గ్రామంలో పారిశుధ్య పనులను పంచాయతీ సిబ్బందితో కలిసి నిరంతరం పర్యవేక్షిస్తామని, ప్రజలు కూడా భాగస్వాములు కావాలని కోరారు. డెంగ్యూ రహిత గ్రామంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని పేర్కొన్నారు. సబ్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ సాదాబ్ ఉమెరా మాట్లాడుతూ డెంగ్యూ దోమ కాటుతో వ్యాపించే వ్యాధి అని, తీవ్రమైన జ్వరం, ఒంటి నొప్పులు దీని ప్రధాన లక్షణాలని తెలిపారు. జ్వరం వచ్చిన వెంటనే ఆర్ఎంపీలను ఆశ్రయించకుండా ప్రభుత్వ వైద్యులను సంప్రదించాలని, ఉచితంగా పరీక్షలు, మందులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు లక్ష్మి , కవిత, రేణుకుంట్ల శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి సతీష్, షేక్ ఆఫ్రోజ్, గ్రామస్తులు పాల్గొన్నారు.



# ఆర్సీబీ మ్యాచ్‌లలో షెహనాజ్ గిల్ సందడి

## దేవదత్ పడిక్కల్‌తో డేటింగ్ రూమర్లు?

**బెంగళూరు, మే 16 :** బాలీవుడ్ నటి షెహనాజ్ గిల్ ప్రస్తుతం ఐపీఎల్ మ్యాచ్‌లలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మ్యాచ్‌లకు హాజరవుతూ సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారారు. ఆర్సీబీ ఆడే ప్రతి చోట ఆమె కనిపించడం అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. ఇటీవల ఆమె ఆర్సీబీ ఆటగాడు దేవదత్ పడిక్కల్‌తో డేటింగ్ చేస్తున్నారనే రూమర్లు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. అయితే ఈ విషయంపై ఇప్పటివరకు ఇద్దరూ ఎటువంటి అధికారిక స్పందన ఇవ్వలేదు. గతంలో ఒక సందర్భంలో షెహనాజ్ మాట్లాడుతూ "ఐ లవ్ విరాట్, ఐ లవ్ దేవదత్" అని చెప్పడంతో ఈ చర్చ మరింత పెరిగింది. ఆర్సీబీ మ్యాచ్‌ల సమయంలో స్టాండ్స్‌లో కనిపిస్తూ అభిమానులను ఉత్సాహపరుస్తూ, జట్టు జెర్సీ ధరించి తన మద్దతును తెలియజేస్తూ షెహనాజ్ గిల్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నారు. ఆమె ఇటీవల సోషల్ మీడియాలో "దిల్ ఆర్సీబీ మే హై" అంటూ చేసిన పోస్ట్ కూడా వైరల్ అయింది. తాజాగా ఇన్‌స్టాగ్రామ్‌లో ఆమె పంచుకున్న వీడియోలో "మజా ఆ గయా" అంటూ బెంగళూరుకు చీర్స్ చెప్పడం అభిమానుల దృష్టిని ఆకర్షించింది. దీంతో ఆమె ఆర్సీబీ జట్టుకు ఎంతగా మద్దతు ఇస్తున్నారో మరోసారి స్పష్టమైంది. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టుపై ఆమె చూపుతున్న ఆసక్తి, నిరంతర హాజరు నేపథ్యంలో రూమర్లు చక్కర్లు కొడుతున్నప్పటికీ, అధికారికంగా ఎటువంటి నిర్ధారణ మాత్రం రాలేదు.

# హార్దిక్ రెండో పెళ్లి ప్రచారం




**ముంబై, మే 16:** హార్దిక్ పాండ్యా రెండో పెళ్లి చేసుకోబోతున్నాడంటూ సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున ప్రచారం సాగుతోంది. ఆయన తన స్నేహితురాలు మహీకా శర్మను వివాహం చేసుకోబోతున్నారనే వార్తలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. అయితే ఈ ప్రచారంలో ఎలాంటి నిజం లేదని విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం ముంబై ఇండియన్స్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరిస్తున్న హార్దిక్ పాండ్యా వెన్నునొప్పి కారణంగా గత మూడు మ్యాచ్‌లకు దూరమయ్యారు. ఆయన గైర్హాజరీలో సూర్యకుమార్ యాదవ్, జస్ప్రీత్ బుమ్రా జట్టు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఇదే సమయంలో ఆయన వ్యక్తిగత జీవితంపై వస్తున్న వార్తలు మరింత చర్చకు దారితీశాయి. మహీకా శర్మ గతంలో ముంబై ఇండియన్స్ జట్టు బస్సులో కనిపించడం, అలాగే అంతర్జాతీయ టీ20 వేడుకల్లో పాల్గొనడం వంటి అంశాలు ఈ వదంతులకు కారణమయ్యాయి. దీంతో ఇద్దరి మధ్య సంబంధంపై సోషల్ మీడియాలో రకరకాల ప్రచారం సాగుతోంది. అయితే ప్రస్తుతం ఐపీఎల్ కీలక దశలో ఉండగా, జట్టు క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న సమయంలో హార్దిక్ పెళ్లి గురించి ఆలోచించే అవకాశం లేదని క్రీడా విశ్లేషకులు భావిస్తున్నారు. సీజన్ ముగిసిన తర్వాత మాత్రమే ఆయన వ్యక్తిగత నిర్ణయాలపై స్పష్టత వచ్చే అవకాశముందని చెబుతున్నారు. ఇప్పటికే గాయం కారణంగా విమర్శలు ఎదుర్కొంటున్న హార్దిక్ పాండ్యా, ఇప్పుడు ఈ పెళ్లి ప్రచారంతో మరోసారి సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారారు.

# కేకేఆర్ గర్జన!

### గుజరాత్ టైటాన్స్‌పై 29 పరుగుల తేడాతో ఘన విజయం

## చెలరేగిన ఫిన్ అలెన్.. వృథా అయిన శుభ్ మన్ గిల్ పోరాటం





**ఐపీఎల్ టోర్నీలో కోల్ కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) అద్భుత విజయం సాధించింది. సొంత గడ్డపై శనివారం జరిగిన ఉత్కంఠ పోరులో పటిష్టమైన గుజరాత్ టైటాన్స్ పై 29 పరుగుల తేడాతో జయభేరి మోగించింది. తొలుత బ్యాటింగ్ చేసిన కేకేఆర్ నిర్ణీత 20 ఓవర్లలో 247 పరుగుల భారీ స్కోరు సాధించగా.. లక్ష్య ఛేదనలో గుజరాత్ 218 పరుగులకే పరిమితమైంది.**

**కోల్‌కతా :** ఈడెన్ గార్డెన్స్ వేదికగా శనివారం జరిగిన మ్యాచ్ లో కోల్ కతా నైట్ రైడర్స్ సత్తా చాటింది. పటిష్టమైన గుజరాత్ టైటాన్స్ కు చుక్కలు చూపించి 29 పరుగుల తేడాతో అద్భుత విజయాన్ని సొంతం చేసుకుంది. ఈ మ్యాచ్ లో టాస్ గెలిచిన గుజరాత్ టైటాన్స్ ఫీల్డింగ్ ఎంచుకోగా.. తొలుత బ్యాటింగ్ కు దిగిన కోల్ కతా బ్యాటర్లు బౌండరీల మోత మోగించారు. నిర్ణీత 20 ఓవర్లలో కేవలం 2 వికెట్లు మాత్రమే కోల్పోయి ఏకంగా 247 పరుగుల భారీ స్కోరును బోర్డుపై ఉంచారు. భారీ లక్ష్య ఛేదనలో గుజరాత్ బ్యాటర్లు గట్టిపోటీ ఇచ్చినా చివరకు నిర్ణీత ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 218 పరుగులకే పరిమితం అయ్యారు.

### ఆకాశమే హద్దుగా అలెన్..

తొలుత బ్యాటింగ్ చేసిన కోల్ కతాకు ఓపెనర్ ఫిన్ అలెన్ అద్భుతమైన ఆరంభాన్ని ఇచ్చాడు. టైటాన్స్ బౌలర్లను ఉతికి ఆరేసిన అలెన్ కేవలం 35 బంతుల్లోనే 93 పరుగులు చేసి తృటిలో సెంచరీ చేజార్చుకున్నాడు. అతడికి తోడుగా అంగ్ క్రిష్ రఘువంశీ కూడా అద్భుత ప్రదర్శన చేశాడు. 44 బంతుల్లో అజేయంగా 82 పరుగులు సాధించి స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. చివర్లో కామెరాన్ గ్రీన్ కేవలం 28 బంతుల్లో అజేయంగా 52 పరుగులు చేసి విధ్వంసం సృష్టించాడు. గుజరాత్ బౌలర్లలో సాయి కిషోర్ 3 ఓవర్లలో 38 పరుగులిచ్చి ఒక వికెట్ తీయగా, మహ్మద్ సిరాజ్ 4 ఓవర్లలో 50 పరుగులిచ్చి ఒక వికెట్ పడగొట్టాడు. అర్షద్ ఖాన్ ఒక ఓవర్లో 22 పరుగులిచ్చి వికెట్ లేకుండానే నిరాశపరిచాడు.

### పోరాడి ఓడిన గిల్, బట్లర్..

248 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన గుజరాత్ టైటాన్స్ ఏ దశలోనూ తగ్గలేదు. కెప్టెన్ శుభ్ మన్ గిల్ 49 బంతుల్లో 85 పరుగులు చేసి ఒంటరి పోరాటం చేశాడు. అతడికి తోడుగా జోస్ బట్లర్ 35 బంతుల్లో 57 పరుగులు, సాయి సుదర్శన్ 28 బంతుల్లో అజేయంగా 53 పరుగులు చేసి లక్ష్యం దిశగా జట్టును నడిపించే ప్రయత్నం చేశారు. భారీ స్కోరు కావడంతో రన్ రేట్ పెరిగిపోయి గుజరాత్ బ్యాటర్లపై ఒత్తిడి పెరిగింది. కోల్ కతా బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో టైటాన్స్ కు ఓటమి తప్పలేదు.

### కట్టడి చేసిన నరైన్..

భారీ లక్ష్య ఛేదనలో ఉన్న గుజరాత్ ను కట్టడి చేయడంలో కోల్ కతా బౌలర్లు సఫలమయ్యారు. ముఖ్యంగా వెటరన్ స్పిన్నర్ సునీల్ నరైన్ అద్భుతంగా బౌలింగ్ చేసి 4 ఓవర్లలో కేవలం 29 పరుగులిచ్చి 2 కీలక వికెట్లు పడగొట్టాడు. సౌరభ్ దూబే 2.4 ఓవర్లలో 23 పరుగులిచ్చి ఒక వికెట్ తీయగా.. బ్యాటింగ్ లో మెరిసిన కామెరాన్ గ్రీన్ బౌలింగ్ లోనూ సత్తా చాటి 3 ఓవర్లలో 25 పరుగులిచ్చి ఒక వికెట్ తన ఖాతాలో వేసుకున్నాడు. సమష్టి కృషితో కోల్ కతా ఈ అద్భుత విజయాన్ని నమోదు చేసింది.

# ఐపీఎల్ టికెట్ల పేరిట సైబర్ మోసాలు

### అభిమానులకు సీపీ సజ్జనార్ హెచ్చరిక

**హైదరాబాద్, మే 16:** క్రికెట్ అభిమానుల ఉత్సాహాన్ని అవకాశంగా మార్చుకుంటూ సైబర్ నేరగాళ్లు కొత్త తరహా మోసాలకు పాల్పడుతున్నారని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్ హెచ్చరించారు. మే 22న హైదరాబాద్ ఉప్పల్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో జరగనున్న సన్‌రైజర్స్ హైదరాబాద్ వర్సెస్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మ్యాచ్ టికెట్ల పేరుతో భారీగా మోసాలు జరుగుతున్నాయని ఆయన వెల్లడించారు. ఈ మ్యాచ్‌కు ఉన్న భారీ డిమాండ్‌ను ఉపయోగించుకుని నకిలీ వెబ్‌సైట్లు, యాప్‌లు, సోషల్ మీడియా లింకులు సృష్టించి తక్కువ ధరలకే టికెట్లు ఇస్తామంటూ ప్రజలను ఆకర్షిస్తున్నారని పోలీసులు తెలిపారు. ముఖ్యంగా అధికారిక టికెటింగ్ భాగస్వామి యాప్‌ను పోలిన నకిలీ యాప్‌లను తయారు చేసి డబ్బులు వసూలు చేస్తున్నారని హెచ్చరించారు. వాట్సాప్, టెలిగ్రామ్, ఇతర సోషల్ మీడియా ద్వారా వచ్చే అపరిచిత లింకులను క్లిక్ చేసి డబ్బులు చెల్లించవద్దని పోలీసులు స్పష్టం చేశారు. కేవలం అధికారిక యాప్‌లు లేదా గుర్తింపు పొందిన వెబ్‌సైట్ల ద్వారానే టికెట్లు కొనుగోలు చేయాలని సూచించారు. ఎవరైనా ఈ తరహా సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్ నంబర్‌కు కాల్ చేయాలని లేదా జాతీయ సైబర్ క్రైమ్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని సీపీ సజ్జనార్ సూచించారు. ఈ జాగ్రత్తలతో అభిమానులు మోసాల బారిన పడకుండా ఉండొచ్చని ఆయన తెలిపారు.

# పాక్ జట్టుకు ఫాతిమా సనా నాయకత్వం



**ఇస్లామాబాద్, మే 16 :** మహిళల టీ20 ప్రపంచకప్ 2026 కోసం పాకిస్థాన్ క్రికెట్ బోర్డు 15 మంది సభ్యులతో కూడిన జట్టును ప్రకటించింది. జట్టుకు కెప్టెన్‌గా ఫాతిమా సనాను నియమించింది. వరుసగా రెండోసారి మహిళల టీ20 ప్రపంచకప్‌లో పాక్ జట్టును ఆమెనే ముందుండి నడిపించనున్నారు. ఇంగ్లండ్, వేల్స్ వేదికగా జూన్ 12 నుంచి జూలై 5 వరకు ఈ మెగా టోర్నీ జరగనుంది. తాజాగా జింబాబ్వేతో జరిగిన టీ20 సిరీస్‌లో అద్భుత ఫామ్‌లో ఉన్న ఫాతిమా సనా ప్రపంచ రికార్డు సృష్టించిన సంగతి తెలిసిందే. కేవలం 15 బంతుల్లోనే అర్ధశతకం సాధించి మహిళల టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో వేగవంతమైన ఫిఫ్టీ నమోదు చేశారు. పాక్ జట్టులో పలువురు యువ ఆటగాళ్లు తొలిసారి ప్రపంచకప్ ఆడనున్నారు. ఈమాన్ ఫాతిమా, నటాలియా పర్వేజ్, రమీన్ షమీమ్, సైరా జబీన్, తస్మియా రుబాబ్‌లకు ఇదే తొలి ప్రపంచకప్ కావడం విశేషం. బ్యాటింగ్ విభాగంలో గుల్ ఫిరోజా, మునీబా అలీ, ఫాతిమా సనాలపై పాక్ జట్టు ఆశలు పెట్టుకుంది. స్పిన్ విభాగంలో సాదియా ఇక్బాల్, నష్రా సంధు, తుబా హసన్ కీలకంగా మారనుండగా, పేస్ దాడిని ఫాతిమా సనా, డయానా బేగ్ ముందుండి నడిపించనున్నారు. గ్రూప్-1లో ఉన్న పాకిస్థాన్ జట్టు భారత్, ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, బంగ్లాదేశ్, నెదర్లాండ్స్ జట్లతో పోటీపడనుంది. జూన్ 14న బర్మింగ్‌హామ్ వేదికగా భారత మహిళల క్రికెట్ జట్టుతో జరిగే మ్యాచ్‌తో పాక్ ప్రపంచకప్ ప్రయాణాన్ని ప్రారంభించనుంది. ప్రపంచకప్‌కు ముందు పాకిస్థాన్ జట్టు ఐర్లాండ్‌లో జరిగే త్రైసిరీస్‌లో వెస్టిండీస్‌తో కలిసి పాల్గొననుంది. అలాగే శ్రీలంక, స్కాట్లాండ్ జట్లతో వార్మప్ మ్యాచ్‌లు కూడా ఆడనుంది.

# నార్త్ అమెరికాలో సరికొత్త రికార్డు దిశగా పెద్ది



రామ్ చరణ్ హీరోగా తెరకెక్కిన 'పెద్ది' చిత్రానికి సంబంధిం చిన నార్త్ అమెరికా ప్రీమియర్ బుకింగ్స్ ఇప్పటికే ఓపెన్ అయ్యాయి. బుకింగ్స్ ప్రారంభమైన నాటి నుంచే ఈ సినిమా కు ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన లభిస్తుంది. తాజాగా ఈ మూవీ యూనిట్ అధికారికంగా వెల్లడించిన వివరాల ప్రకారం, ఇప్పటివరకు నార్త్ అమెరికా ప్రీమియ ర్స్‌కు సంబంధించిన 10 వేల టికెట్లు అమ్ముడయ్యాయి. ఈ సినిమాను జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయను ండగా, ప్రీమియర్ షోలను జూన్ 3న ప్రదర్శించనున్నారు. విడుదల తేదీకి ఇంకా సమయం ఉండటంతో పాటు, ఈ మూవీ ట్రైలర్ కూడా ఇంకా విడుదల కాలేదు. ట్రైలర్ ప్రేక్షకులను ఆక ట్టుకునేలా ఉంటే టికెట్ సేల్స్ మరింత పెరిగే అవకాశము ందని ట్రేడ్ విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు. ముఖ్యం గా ట్రైలర్ అంచనాలకు మించి ఆకట్టుకుంటే నార్త్ అమెరికాలో 'పెద్ది' ప్రీమియర్ బుకింగ్స్ సరికొత్త రికార్డు లను సృష్టించే అవకాశముందని సినీ వర్గాలు భావిస్తున్నాయి.

# 'వృషకర్మ' నుంచి షూటింగ్ అప్డేట్..



అక్కినేని హీరో నాగచైతన్య నటిస్తున్న లేటెస్ట్ చిత్రం 'వృషకర్మ'. 'తండేల్' బ్లాక్ బస్టర్ హిట్ తర్వాత చైతు నుంచి వస్తున్న ఈ మూవీపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. అంతే కాకుండా 'విరుపాక్ష' చిత్రంతో ఫుల్ ఫేమ్ తెచ్చుకున్న డైరెక్టర్ కార్తీక్ వర్మ దండు ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తుండగా అంచనాలు ఆకాశాన్ని అంటుతున్నాయి. దీంతో సినిమా నుంచి వచ్చే అప్డేట్స్ కోసం ఫ్యాన్స్ ఈగర్‌గా వెయిట్ చేస్తున్నారు. ఇందులో భాగంగానే తాజాగా వృషకర్మ షూటింగ్ అప్డేట్ ఇచ్చారు మేకర్స్. ఈ మేరకు.. 'వృషకర్మ టీమ్ రాజస్థాన్‌లో కీలక షెడ్యూల్‌ను విజయవంతంగా పూర్తి చేసింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. రిలీజ్ డేట్ అనౌన్స్‌మెంట్ త్వరలోనే' అంటూ కొన్ని క్యూట్ పిక్స్ షేర్ చేశారు. లషూటింగ్‌కు సంబంధించిన ఫొటోలతో పాటు హీరో నాగచైతన్య, హీరోయిన్ మీనాక్షి చౌదరి లుక్స్ అంద రిని ఆకట్టుకుంటున్నాయి. ఈ భారీ మైథలాజికల్ అడ్వెంచర్ థ్రిల్లర్‌లో మీనాక్షి చౌదరి హీరోయిన్ గా నటిస్తుండగా.. స్పర్శ శ్రీవాత్సవ విలన్‌గా కనిపించ నున్నాడు. శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర, సుకుమార్ రైటింగ్స్ బ్యానర్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. బి. అజనీష్ లోక్‌నాథ్ సంగీతం అందిస్తున్నాడు.

# ఈ నెల 19 అర్ధరాత్రి ఫస్ట్ గ్లింప్స్!



యంగ్ టైగర్ ఎన్టీఆర్, సంచలన దర్శకుడు ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో రాబోతున్న భారీ చిత్రం కోసం అభిమానులు అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం 'చీ=చీవవశ్రీ' (వర్కింగ్ టైటిల్)గా పిలుస్తున్న ఈ సినిమాపై అంచనాలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ఈ క్రమంలో ఎన్టీఆర్ పుట్టినరోజు (మే 20) సందర్భంగా అభిమానులకు అదిరిపోయే కానుక ఇచ్చేందుకు చిత్రబృందం సిద్ధమైంది. 19వ తేదీ అర్ధరాత్రి ఈ సినిమా ఫస్ట్ గ్లింప్స్‌ను విడుదల చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించింది. ఈ మెగా ప్రాజెక్ట్ టీజర్‌ను కేవలం తెలుగులో మాత్రమే కాకుండా, దేశవ్యాప్తంగా ఐదు భాషల్లో విడుదల చేయనున్నారు. తెలుగుతో పాటు హిందీ, కన్నడ, తమిళం, మలయాళ భాషల్లో ఒకేసారి టీజర్‌ను రిలీజ్ చేసి, పాన్-ఇండియా స్థాయిలో ప్రకంపనలు సృష్టించేందుకు మేకర్స్ ప్లాన్ చేశారు. దీంతో ఈ సినిమాపై దేశవ్యాప్తంగా ఉన్న హైప్ మరో స్థాయికి చేరింది. చిత్ర బృందం విడుదల చేసిన ఓ కొత్త స్టిల్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఎడారి మధ్యలో ఓ వ్యక్తి చేతిలో కర్ర పట్టుకుని నిలబడి ఉన్న ఈ పోస్టర్, సినిమా ప్రపంచం ఎలా ఉ ండబోతోందనే ఉత్కంఠను రేకెత్తించింది. ప్రాజెక్ట్ ప్రకటించినప్పటి నుంచే దీనిపై భారీ అంచనాలు నెలకొన్నాయి. తెలుగు సినిమాలోని టాప్ హీరోల్లో ఒకరైన ఎన్టీఆర్, భారీ యాక్షన్ చిత్రాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిన ప్రశాంత్ నీల్ కలయిక కావడంతో ఈ సినిమాపై అంచనాలు తారాస్థాయికి చేరాయి. మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. మే 19 అర్ధరాత్రి విడుదల కాబోయే ఫస్ట్ గ్లింప్స్, ఈ సినిమా స్థాయిని, కథా నేపథ్యాన్ని ప్రేక్షకులకు పరిచయం చేయనుంది. ఈ టీజర్ కోసం తారక్ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# ఆ పుస్తకంపైనే అందరి ఆసక్తి!



తమిళనాడు ముఖ్యమంత్రిగా విజయ్ బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్నారు. తాజాగా లోకనాయకుడిగా పేరొందిన నటుడు, మక్కల్ నీది మయ్యం (వీచీవీ) పార్టీ అధినేత అయిన కమల్ హాసన్ విజయ్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రస్తుతం డీఎంకే కూటమిలో ఉన్న కమల్ హాసన్.. విజయ్ తో భేటీ అవ్వడం చర్చనీయాంశమయింది. విజయ్ ను కలిసిన ఫొటోలను కమల్ హాసన్ తన సోషల్ మీడియా అకౌంట్లలో పోస్ట్ చేశారు. తమిళనాడు సీఎం, సోదరుడు విజయ్ ను వ్యక్తిగతంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసినట్లు ఆ పోస్ట్ కింద రాసుకొచ్చారు. తమిళనాడు అభ్యున్నతి కోసం ఆయన కంటున్న ఎన్నో కలలను ఈ సందర్భంగా తనతో పంచుకున్నారని, భేటీ అయిన సమయంలో విజయ్ చూపించిన వినయం, ఆప్యాయత తనను ఎంతో గర్వపడేలా చేశాయని కమల్ హాసన్ పోస్ట్ కింద పేర్కొన్నారు. అలాగే.. వివిధ రకాల అడ్డంకులు, సవాళ్లను ఎదుర్కొంటున్న కోలీవుడ్ కు ప్రభుత్వ మద్దతు, ప్రోత్సాహం ఎంతో అవసరమని కమల్ హాసన్ ఈ సందర్భంగా విజయ్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. తమిళ సినీ పరిశ్రమ అభివృద్ధిని కాంక్షిస్తూ.. ఆరు ముఖ్యమైన డిమాండ్లతో వినతిపత్రాన్ని సీఎం విజయ్ కు అందించినట్లు కూడా తెలిపారు. తాజా భేటీలో కమల్ హాసన్ సీఎం విజయ్‌కు ప్రముఖ చరిత్రకారుడు రామచంద్ర గుహ రాసిన 'గాంధీ బిఫోర్ ఇండియా' అనే పుస్తకాన్ని బహుమతిగా అందించడం విశేషం. గతంలో విజయ్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన సమయంలో కూడా కమల్ హాసన్ సోషల్ మీడియా ద్వారా శుభాకాంక్షలు తెలిపారు. అప్పట్లో విలేకరులతో మాట్లాడుతూ.. విజయ్‌ను ఇకపై కేవలం ఒక నటుడిగా మాత్రమే చూడకూడదని హితవు పలికారు. "ఆయనకు ఇప్పుడు రాష్ట్ర బాధ్యతలు ఉన్నాయి. ముఖ్యమంత్రి అనే వ్యక్తి ఏ రంగం నుండైనా రావచ్చు. కానీ విజయ్ మన సినీ పరిశ్రమ నుండి ముఖ్యమంత్రి స్థాయికి ఎదగడం నాకు ఎంతో గర్వకారణంగా ఉంది" అని కమల్ హాసన్ అప్పట్లోనే వ్యాఖ్యానించారు.

# రూ.12 కోట్ల ఆఫర్‌ను తిరస్కరించిన త్రిష..



వరుస సినిమాలతో సందడి చేస్తున్నారు నటి త్రిష. ఇప్పుడు ఆమెకు సంబంధించిన ఓ వార్త సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అగ్ర కథానాయకులు కమల్ హసన్ - రజనీకాంత్ కలిసి నటిస్తోన్న చిత్రంలో ఆమెను ఎంపిక చేసినట్లు గతంలో వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో రానున్న ఈ చిత్రం కోసం ఆమె భారీగా పారితోషికం తీసుకోనున్నట్లు కూడా ఎన్నో వార్తలు చక్కర్లు కొట్టాయి. అయితే, తమిళనాడు ఎన్నికల ఫలితాల అనంతరం త్రిష సినిమాల ఎంపికల్లోనూ ఎన్నో విషయాలు ఆలోచించి నిర్ణయాలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. అందులోభాగంగానే ఈ సినిమా కోసం ఏకంగా రూ. 12 కోట్లు ఆఫర్ చేసినప్పటికీ ఇందులో నటించేందుకు ఆమె సుముఖత చూపించడం లేదని ఆంగ్ల మీడియాలో కథనాలు వస్తున్నాయి. కమల్ హాసన్ - రజనీకాంత్ 46 ఏళ్ల తర్వాత కలిసి నటిస్తుండడంతో ఈ ప్రాజెక్ట్‌పై అందరిలో ఆసక్తి నెలకొంది. భారీ పారితోషికం ఆఫర్ చేసినప్పటికీ ఆమె దీన్ని రిజెక్ట్ చేయడం వెనక బలమైన కారణం ఉందని టాక్. ఈ సినిమాను ఉదయనిధి స్టాలిన్‌కు చెందిన రెడ్‌జెయింట్ నిర్మాణసంస్థ తెరకెక్కించడంతో ఆమె తిరస్కరించినట్లు ఆంగ్ల మీడియా పేర్కొంది. అసలు త్రిష ఈ ప్రాజెక్ట్‌లో నటిస్తున్నారా లేదా అనే దానిపై అధికారిక ప్రకటన కోసం అభిమానులు ఎదురుచూస్తున్నారు. ఇక తాజాగా 'వీరభద్రుడు'లో లాయర్ ప్రీతిగా మెప్పించారు త్రిష. ప్రస్తుతం చిరంజీవికి జోడీగా 'విశ్వంభర'లో నటిస్తున్నారు. వశిష్ఠ దర్శకత్వంలో సోషియో ఫాంటసీ ఫిల్మ్‌గా రూపొందుతోంది. భారీస్థాయిలో రానున్న ఈ సినిమా కోసం ప్రపంచంలోనే టాప్ వీఎఫ్ఎక్స్ కంపెనీలు పనిచేస్తున్నాయి.

# మమ్ముట్టిని కలిసిన రేణుదేశాయ్




నటి రేణు దేశాయ్ ప్రస్తుతం వరుస ప్రాజెక్టులతో మళ్లీ బిజీగా మారుతున్నారు. ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కు విడాకులు ఇచ్చిన తర్వాత కొంతకాలం పాటు ఆమె ఇద్దరు పిల్లల బాధ్యతలను చూసుకుంటూ ఇంటికే పరిమితమయ్యారు. అయితే, కొన్నేళ్ల క్రితం సినిమాల్లోకి రీఎంట్రీ ఇచ్చిన రేణు దేశాయ్, ప్రస్తుతం ఒకవైపు కమర్షియల్ యాడ్స్, సినిమాలు చేస్తూనే.. మరోవైపు మూగజీవాల సంరక్షణ కోసం ఒక ఎన్జీవోను నడుపుతూ వాటి హక్కుల కోసం నిరంతరం పోరాడుతున్నారు. తాజాగా రేణు దేశాయ్ మాలీవుడ్ మెగాస్టార్ మమ్ముట్టిని కలిశారు. ఆ క్షణాలను సోషల్ మీడియా వేదికగా అభిమానులతో పంచుకున్నారు. మమ్ముట్టిని కలవడం తన జీవితంలో ఒక క్రేజీ మూమెంట్ అని, ఆయనను కలవడం తన లైఫ్ టైమ్ డ్రీమ్ అని ఆమె పేర్కొన్నారు. ఒక వీరాభిమానిగా మమ్ముట్టి సార్‌ను కలిసి, ఆయనతో కొంత సమయం గడపడం వల్ల తన హృదయం ఆనందంతో ఉప్పొంగిపోతోందని రేణు దేశాయ్ ఎమోషనల్ అయ్యారు. తాను ఇప్పటివరకు కలిసిన వారిలో మమ్ముట్టి అత్యంత ప్రతిభావంతుడు, వినయశీలి, తెలివైనవాడు, దయగల వ్యక్తి అంటూ ఆమె ప్రశంసలు కురిపించారు. ప్రస్తుతం మమ్ముట్టితో ఆమె దిగిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

# నిర్మాతలకు డబ్బు వృథా కాదు..



ప్రస్తుతం బ్యాక్ టు బ్యాక్ ఆఫర్లు అందు కుంటూ స్టార్ హీరోల సరసన నటిస్తూ క్రేజీ బ్యూటీగా దూసుకుపోతున్న మాళవిక మోహనన్.. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొని కోలీవుడ్ స్టార్ హీరో, తమిళనాడు సీఎం విజయ్ దళపతిపై ప్రశంసలు కురిపించింది. 'మాస్టర్ సినిమా ఫస్ట్ డే షూటింగ్‌లోనే చాలా కష్టమైన సీన్ చేయాల్సి వచ్చి నా ఫోకస్ మొత్తం డైలాగ్స్ పైనే పెట్టాను. కానీ విజయ్ మాత్రం ఎలాంటి కష్టమైన్ సీన్‌లో నటించాల్సి వచ్చినా చాలా కూల్‌గా ప్రతి విషయంపై ఫోకస్ చేస్తారు. చాలా సరదాగా ఉంటారు. అంతేకాదు.. ఎప్పుడు ఏ అవసరం వచ్చిన ఫోన్ చేయగలిగే స్వేచ్ఛను ఇచ్చారు. అంత పెద్ద స్టార్ అయినప్పటికీ అలా అందుబాటులో ఉండటం గొప్ప విషయం' అని చెప్పుకొచ్చింది. 'మోహన్‌లాల్, రజనీకాంత్, విజయ్ వంటి సీనియర్ స్టార్ నటుల సినిమాల్లో నటించడం వల్ల ఎన్నో విషయాలు నేర్చుకున్నారు. ఉదయం 7 గంటలకు షూటిం గ్ అంటే వాళ్లు 6:55 సెట్స్‌లో ఉంటారు. అలాంటి వారి వల్ల నిర్మాతలకు డబ్బు వృథా కాదు' అని తెలిపింది.

# అది నా అదృష్టం..



'నటుడిగా నేను కెరీర్ ప్రారంభించిన తొలి సినిమాకే మరిడేశ్ బాబు లాంటి అద్భుతమైన పాత్ర రావడం నా అదృష్టంగా భావిస్తున్నాను. అంతకంటే మంచి డెబ్యూని నేను కోరుకోలేను. సినిమా బండి సినిమా నటుడిగా నాకు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చింది' అని రాగ్ మయూర్ అన్నారు. విభిన్నమైన కథలను ఎంచుకుంటూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న రాగ్ మయూర్.. ఇండస్ట్రీకి వచ్చి మే15తో ఐదేళ్లు పూర్తవు తుంది. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తనకు తొలి అవకాశం ఇచ్చిన దర్శకుడు ప్రవీణ్ కండ్రేగులకు, నిర్మాతలు రాజ్ నిడిమోరు, కృష్ణ డి.కెలకు జీవితాంతం రుణపడి ఉంటానన్నారు. ప్రముఖ హిందీ వెబ్ సిరీస్ 'పంచాయత్'కు రీమేక్‌గా వచ్చిన 'సివరాపల్లి' నటుడిగా మరింత గుర్తింపు తెచ్చింది. 'సివరాపల్లి' సూపర్‌హిట్ తర్వాత నాకు మరింత ఆత్మ విశ్వాసం వచ్చింది. చాలా మంది దర్శకులు నన్ను దృష్టిలో పెట్టుకుని పాత్రలను రాశామని చెప్పారు. దర్శకులు నాకోసం ప్రత్యేకంగా పాత్రలు రాయటం అనేది నటుడిగా నాకు గొప్ప గుర్తింపు. నేను థియేటర్ ఆర్టిస్ట్ కావటంతో నటనలో విభిన్న కోణాలను అన్వేషించే అవకాశం దక్కింది. అది నా నటనను మరింత మెరుగు పరిచింది. ప్రస్తుతం డైరెక్టర్ గౌరి నాయుడు జమ్ము తెరకెక్కిస్తోన్న 'గరివిడి లక్ష్మి'లో బుర్రకథ కళాకారుడి పాత్ర చేశా. ఇది చాలా ఎక్సైటింగ్‌తో పాటు ఛాలెంజింగ్ పాత్ర కూడా. ఈ పాత్ర కోసం ఎంతో ప్రిపేర్ అయ్యి నటించాను. నా ఫిల్మోగ్రఫీపై గర్వంగా ఉంది. కెరీర్ ప్రారంభ దశలోనే అగ్రశ్రేణి దర్శకులు, టెక్నీషియన్స్‌తో పని చేసే అవకాశం రావడం నా అదృష్టం. ఎమోషన్స్, రియలిస్టిక్ కథనాలకు ప్రాధాన్యం ఉన్న సినిమాల్లో నటించాలని ఎప్పటినుంచో కోరుకున్నాను' అని అన్నారు.

Printed, Published and Owned by **RAVU RAJITHA,** Printed at **KAKATHIYA PRINTERS,** LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY. RAJAMUDRA PUBLICATIONS,** Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684,** Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com